సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 31 । అక్టోబర్ । 2023



రౌడీ షీటర్లపై నిఘా..

ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పోలీసులు రౌడీ షీటర్లపై నిఘా పెంచారు. పలువురిని బైండోవర్ చేశారు. IIలో



అంతా అరచేతిలోనే..

అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సాంకేతిక పరిజ్ఞానం తోడ్పాటుతో ఈసీ తగిన ఏర్పాట్లు చేస్తోంది. IIలో



వాతావరణం

జిల్లాలో మంగళవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం చల్లగా ఉండే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ముత్తంగి అలంకరణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీసీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలోని మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

ప్రభాకర్‌రెడ్డిపై దాడి హేయనీయం

ఖమ్మంమయూరిసెంటర్: దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి, మెదక్ ఎంపీ కొత్తా ప్రభాకర్‌రెడ్డిపై ఎన్నికల ప్రచారం సందర్భంగా కత్తితో దాడి చేయడం హేయనీయమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్ష నేత నామ నాగేశ్వరరావు వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. రాజకీయాల్లో, ప్రజాస్వామ్యంలో హత్యా రాజకీయాలకు తావులేదని, బాధ్యులను చట్టపరంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

అధికారులు బిజీ బిజీ..

క్షణం తీరిక లేకుండా ఎన్నికల విధులు

- రెండు చోట్ల పీఓ, ఏపీఓలకు శిక్షణ ప్రారంభం
- సీఎం బహిరంగ సభకు భద్రతా ఏర్పాట్ల పరిశీలన

శాసనసభ సాధారణ ఎన్నికల ప్రక్రియ వేగం పుంజుకుంటోంది. మరో నాలుగు రోజుల్లో నోటిఫికేషన్ వెలువడనుండగా అధికారులు, సిబ్బందికి విధి నిర్వహణలో క్షణం తీరిక లేని పరిస్థితి నెలకొంది. సోమవారం పినపాక, అశ్వారావుపేట నియోజకవర్గాల పోలింగ్ సిబ్బందికి శిక్షణ ప్రారంభమైంది. జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక అల, ఎస్పీ డాక్టర్ వినీత్, పినపాక రిటర్నింగ్ అధికారి ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ తదితరులు సభలు, సమావేశాలతో బిజీగా మారారు. కలెక్టర్ ఐదు నియోజకవర్గాలకు సహాయ వ్యయ పరిశీలకులను నియమించారు. బుధవారం ఇల్లెందులో జరిగే సీఎం బహిరంగ సభాస్థలి వద్ద ఎస్పీ వినీత్ రక్షణ ఏర్పాట్లను పరిశీలించారు. తగిన సూచనలు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక

ప్రతీ పైసాకు లెక్క..

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎన్నికలు ముగిసే వరకు పోటీ చేసే అభ్యర్థులు చేసే ఖర్చుపై ప్రతిపైసాకు లెక్క ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక అల పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రత్యేక బ్యాంకు ఖాతాల ప్రారంభం, నగదు లావాదేవీల నిర్వహణ తదితర అంశాలపై ఆదాయపు పన్ను, బ్యాంకు కంట్రోలింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నవంబర్ 3 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండగా, అభ్యర్థులు ప్రత్యేక బ్యాంకు ఖాతాలను ప్రారంభించాల్సి ఉంటుందని తెలిపారు. బ్యాంకు లావాదేవీలపై పటిష్ట నిఘా ఉంటుందని, ఏటీఎంలకు, ఇతర బ్రాంచీలకు నగదు రవాణా చేసేందుకు అనుమతులు తీసుకోవాలని అన్నారు. రూ .10 లక్షలకు మించి జరిగే లావాదేవీలపై ఆదాయపు పన్ను శాఖ అధికారుల ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. అభ్యర్థులు నామినేషన్‌లో పేర్కొన్న కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలపై కూడా ప్రత్యేక నిఘా ఉంచాలలన్నారు. ఈ సమావేశంలో వ్యయపరిశీలక నోడల్ అధికారులు ఎస్ వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరెడ్డి, ఎల్‌బీఎం రాంరెడ్డి, ఆదాయపు పన్ను శాఖ నోడల్ అధికారి సింధు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర నివేదికలు అందజేయాలి

సీజ్ చేసిన, నగదు, మద్యం తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారులు సమగ్ర నివేదికలు అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం పోలీస్, సీజర్స్ గ్రీవెన్స్ కమిటీ, రిటర్నిగ్ అధికారులు, ఎక్సైజ్ అధికారులతో ఎన్నికల విధులు కేటాయించిన అధికారుల సహాయ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ జారీ, బెల్ట్‌షాపుల మూసివేత తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పట్టుకున్న నగదుకు తక్షణమే రశీదులు అందించాలన్నారు. పట్టుకున్న నగదు, ఆభరణాలు, మద్యం తదితర వస్తువుల వివరాలు ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టంలో ఆన్‌లైన్ చేయాలని అన్నారు. జిల్లాలో 756 బెల్ట్‌షాపులను మూసివేసినట్లు తెలిపారు. 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు, 40 శాతం పైగా అంగవైకల్యం కలిగిన దివ్యాంగులకు పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందన్నారు.

హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలి

పట్టుబడిన నగదు, ప్రచారంలో పొందాల్సిన అనుమతులపై అవగాహన కలిగించేందుకు ఐదు నియోజకవర్గాల రిటర్నింగ్ కార్యాలయాల్లో 24 గంటలు పనిచేసే విధంగా హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రచారానికి కావాల్సిన అనుమతులలో ఎలాంటి జాప్యం చేయవద్దని అన్నారు. ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బంది ఓటుహక్కు వినియోగానికి నవంబర్ 10వ తేదీ లోగా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేయాలని వివరించారు. ఈ సమావేశంలో ఎస్పీ డాక్టర్ వినీత్, పినపాక నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ప్రతీక్‌జైన్, అశ్వారావుపేట ఇన్‌చార్జ్ రాంబాబు, సీజర్స్ కమిటీ నోడల్ అధికారి మధుసూదన్‌రాజు, ఎస్ వెంకటేశ్వర్లు, దుర్గాంబ, కొత్తగూడెం, భద్రాచలం రిటర్నింగ్ అధికారులు శిరీష, మంగీలాల్, కార్తీక్ పాల్గొన్నారు.

ఎన్నికల సంఘం వీడియో కాన్ఫరెన్స్..

అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు చేపట్టాల్సిన చర్యలపై కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ కమిషనర్ నితేష్‌వ్యాస్ సోమవారం ఢిల్లీ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా నుంచి ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక హాజరయ్యారు. ఎస్పీ డాక్టర్ వినీత్, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, ఏఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్ రాంబాబు, మధుసూదన్ రాజు, ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నాలుగు గంటల వరకే పోలింగ్..

జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ జరగనుంది. రాష్ట్రంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన 13 నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ జరపాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఆ 13 నియోజకవర్గాల్లో జిల్లాలోని ఐదు నియోజకవర్గాలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ..



శిక్షణకు హాజరైన పీఓలు, ఏపీఓ

మణుగూరు టౌన్: పినపాక నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల సిబ్బంది పీఓ, ఏపీఓలకు సోమవారం మణుగూరు ఇల్లెందు క్లబ్‌లో శిక్షణ ప్రారంభమైంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై ఐటీడీఏ పీఓ, రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాఘవరెడ్డి అవగాహన కల్పించారు. శిక్షణా సిబ్బంది కోటేశ్వరరావు ఉన్నారు.

నామినేషన్ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్

మణుగూరు రూరల్: నవంబర్ 3వ తేదీ నుంచి చేపట్టబోయే నామినేషన్ల ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లను సోమవారం పినపాక నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్ మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ ప్రక్రియ జరుగుతుందని, నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితోపాటు నలుగురిని మాత్రమే అనుమతించాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియ సీసీ కెమెరాల పర్యవేక్షణలో సాగుతుందని, వీడియో గ్రాఫింగ్ కూడా చేస్తామని తెలిపారు. అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.రాఘవరెడ్డి పాల్గొన్నారు.

సహాయ వ్యయ పరిశీలకుల నియామకం

శాసనసభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు సహాయ వ్యయ పరిశీలకులను జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక అల సోమవారం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పినపాక నియోజకవర్గానికి డి.మహేష్‌కుమార్(డీఏఓ), ఎన్ సుబ్బారావు (అసిస్టెంట్ రిజిస్ట్రార్), కె రమేష్ (సీనియర్ ఇన్‌స్పెక్టర్, డీసీఓ), ఇల్లెందు నియోజక వర్గానికి సీహెచ్ కోటయ్య (డీఏఓ ఆఫీసర్), జి శ్రీనివాసకుమార్(అసిస్టెంట్ రిజిస్ట్రార్), ఆర్.చక్రవర్తి(సీనియర్ ఆడిటర్), ఎండి ఖాజా జమీరుద్దీన్(సీనియర్ ఆడిటర్), కొత్తగూడెం నియోజకవర్గానికి ఎ.నాగరాజు(డివిజన్ అకౌంట్స్ ఆఫీసర్), కె.శ్రీనివాసరావు(అసిస్టెంట్ రిజిస్ట్రార్), జి ఉష(సీనియర్ ఇన్‌స్పెక్టర్, డీసీఓ), జి.శివనందిని (జూనియర్ అసిస్టెంట్, డీసీఓ)లను నియమించారు.

అశ్వారావుపేట నియోజకవర్గానికి కె శంకరాచార్యులు(డీఏఓ), బి.ఏడుకొండలు(అసిస్టెంట్ రిజిస్ట్రార్), వంశీకృష్ణ(సీనియర్ ఆడిటర్), ఎండి జాఫర్ అలీ(సీనియర్ ఆడిటర్), భద్రాచలం నియోజకవర్గానికి వి.శ్రీనివాస్(డీఏఓ), డి.రాజు(అసిస్టెంట్ రిజిస్ట్రార్), టి.సుజాత(సీనియర్ ఇన్‌స్పెక్టర్ డీసీఓ), టి.రాహుల్(జూనియర్ అసిస్టెంట్, డీసీఓ)లను నియమించారు.

విధులు సమర్థంగా నిర్వర్తించాలి

అశ్వారావుపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా అదనపు కలెక్టర్, అశ్వారావుపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పర్సా రాంబాబు సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాలలో సోమవారం ప్రారంభమైన పీఓ, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విధుల పట్ల అలసత్వం వహించొద్దన్నారు. మాస్టర్ ట్రైనీలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌ఓలు కృష్ణ ప్రసాద్, ఎండి ముజాహిద్, జి.పుల్లారావు, జగదీశ్వర ప్రసాద్, సాధియా సుల్తానా, మాస్టర్ ట్రైనీలు పీఎస్‌ఎస్‌వీ ప్రసాద్, వి సత్యనారాయణ, జి వెంకటేశ్వర్లు, ఉపేందర్ రెడ్డి, బి శంకర్, ఆనంద్, సెక్టార్ అధికారులు సీహెచ్‌వీ రామకృష్ణ, ఎన్నికల డీటీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన పీఓ, ఏపీఓలు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

‘సుప్రీం’ తీర్పుపై ఉత్కంఠ

- సుప్రీం కోర్టు పరిధిలో వనమా వర్సెస్ జలగం కేసు
- అనర్హత కేసులో ఇప్పటికే పూర్తయిన విచారణ
- నేడు తీర్పు వెలువరించనున్న అత్యున్నత న్యాయస్థానం
- తీర్పు తదనంతర పరిణామాలపై జోరుగా చర్చ



జలగం వెంకట్రావు



వనమా వెంకటేశ్వరరావు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గత మూడు నెలలుగా కొనసాగుతున్న సస్పెన్స్‌కు నేడు తెర పడనుంది. ‘కొత్తగూడెం’ విషయంలో ప్రస్తుత ఎమ్మెల్యేగా వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావుల మధ్య నడుస్తున్న కేసులో మంగళవారం సుప్రీం కోర్టు తీర్పు వెలువరించనుంది. దీంతో తీర్పు ఎలా ఉండబోతుందనే ఉత్కంఠ కొత్తగూడెం బీఆర్‌ఎస్ పార్టీలో నెలకొంది.

వనమా ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు తీర్పు.. సుప్రీం కోర్టును ఆశ్రయించిన వనమా

2018లో జరిగిన తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గం నుంచి వనమా వెంకటేశ్వరరావు, జలగం వెంకట్రావులు పోటీ చేశారు. అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న వెంకట్రావుపై వనమా వెంకటేశ్వరావు 4,139 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఎన్నికల హడావుడి ముగిసిన తర్వాత వనమా గెలుపును సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో 2019లో జలగం కేసు దాఖలు చేశారు. నామినేషన్ సందర్భంగా ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో వనమా తప్పుడు వివరాలు సమర్పించారంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. నాలుగేళ్లపాటు విచారణ కొనసాగిన కేసులో 2023 జూలై 25న తీర్పు వచ్చింది. వనమా ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు పేర్కొంది. దీన్ని సవాల్ చేస్తూ వనమా వెంకటేశ్వరరావు సుప్రీం కోర్టును ఆశ్రయించారు.

రెబల్‌గా జలగం

కొత్తగూడెం ఎమ్మెల్యే అనర్హత కేసులో ఇరువర్గాలు సుప్రీం కోర్టులో కౌంటర్లు దాఖలు చేశాయి. ఆగస్టు, సెప్టెంబర్‌లో విచారణ జరిగింది. అయితే ఈ కేసులో తీర్పును అక్టోబరు 31కి న్యాయస్థానం రిజర్వ్ చేసి ఉంచింది. నేడు సుప్రీం కోర్టు వెలువరించే తీర్పు వనమా వెంకటేశ్వరావుకు ప్రతికూలంగా వస్తే, పరిస్థితులు ఏ మలుపు తీసుకుంటాయనే చర్చ బీఆర్‌ఎస్ పార్టీలో జోరుగా కొనసాగుతోంది. మరోవైపు జలగం వెంకట్రావు అభ్యంతరాలను న్యాయస్థానం తోసి పుచ్చితే, రాజకీయంగా ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే ఆసక్తి నెలకొంది. ఇప్పటికే జలగం మద్దతుదారులు బీఆర్‌ఎస్ రెబల్‌గా జలగం కొత్తగూడెం బరిలో ఉండటం ఖాయమంటూ సోషల్ మీడియాలో ప్రచారం హోరెత్తిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ టికెట్ మీద కొత్తగూడెం నుంచి బరిలో ఉంటారనే ప్రచారం జరుగుతోంది.

వనమాకు అండగా కేసీఆర్

హైకోర్టు తీర్పు వెలువడ్డాక విపత్కర పరిస్థితుల్లో ఉన్న కొత్తగూడెం ఎమ్మెల్యే వనమాకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అండగా నిలిచారు. ప్రగతి భవన్‌కు ప్రత్యేకంగా పిలిపించుకుని పార్టీ తరఫున అండగా ఉంటామంటూ భరోసా ఇచ్చారు. దీంతో అప్పటివరకు నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌లో కొనసాగుతూ వస్తోన్న గ్రూపు రాజకీయాలు సద్దుమణిగాయి. ఎంపీ వద్దిరాజు రవిచంద్రను ప్రత్యేకంగా నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు. సీఎం కేసీఆర్ తిరిగి వనమాకే టికెట్ కేటాయించడంతోపాటు బీ ఫామ్‌ను అందించారు. కేసీఆర్ ప్రోత్సాహంతో వనమా ఇప్పటికే ప్రచారం ఉధృతంగా కొనసాగిస్తున్నారు. ఊరువాడా తిరుగుతూ ‘ఇవే తనకు చివరి ఎన్నికలు. ఒక్కసారి అవకాశం ఇవ్వాలి. అంటూ కోరుతున్నారు. 5న కొత్తగూడెంలో సీఎం హాజరయ్యే బహిరంగ సభకు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల రహస్య భేటీ!

- సీఎం సభ విజయవంతానికి ఎంపీ రవిచంద్ర సమీక్ష
- గైర్హాజరైన మున్సిపల్ ఛైర్‌పర్సన్, పలువురు కౌన్సిలర్లు
- కొత్తగూడెంలో 20 మంది కౌన్సిలర్లు ప్రత్యేకంగా సమావేశం !

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీలో అధికార బీఆర్‌ఎస్ పార్టీలో అసమ్మతి సెగ చల్లారలేదు. సోమవారం కొత్తగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుతో కలిసి ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. నవంబర్ 5న కేసీఆర్ సభ విజయవంతంతోపాటు కొత్తగూడెం బీఆర్‌ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావును భారీ మెజార్టీతో గెలిపించాలనే ప్రధాన ఎజెండాగా చర్చించారు. కానీ ఈ సమావేశానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్‌తో సహా మెజారిటీ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. అధికార పార్టీలో ఉన్న 20 మంది కౌన్సిలర్లు విడిగా సమావేశమయ్యారు. తమను అధికారులు, అధినాయకులు గుర్తించడం లేదని, ప్రజలు ఎన్నుకున్న తమను నిర్లక్ష్యం చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇలాంటి పరిణామాలను ఉపేక్షించొద్దని చర్చించుకున్నట్లు తెలిసింది. సరైన గుర్తింపు ఇవ్వకపోవడమే కాకుండా కొందరు చోటామోటా నాయకుల చిల్లర రాజకీయాలకు ప్రాధాన్యతనిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

ఆత్మగౌరవం దెబ్బతింటోందని..

సీఎం సభకు ప్రతి కౌన్సిలర్ 500 మందికి తక్కువ కాకుండా జనసమీకరణ చేయడానికి నిర్ణయించామని, ఎమ్మెల్యే వనమాతో కూడా తమకు ఎలాంటి విభేదాలు లేవని చేస్తున్నారు. అయితే కొందరు నాయకుల వల్ల తమ ఆత్మగౌరవం దెబ్బతింటోందని మనోవేదన చెందుతున్నట్లు ఆ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఇటీవల రాజ్యసభ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వద్దిరాజు రవిచంద్ర సమక్షంలో కూడా తమ మధ్య అరమరికలు లేవని స్పష్టం చేశామని, కానీ స్వార్థరాజకీయాలు చేసే వారిపట్ల అప్రమత్తంగా ఉండకపోతే పార్టీకి నష్టం జరుగుతుందని వ్యాఖ్యానిస్తున్నారు. ఒకరిద్దరు కౌన్సిలర్లు బాహాటంగానే అసంతృప్తిని వెళ్లగక్కినట్లు తెలుస్తోంది. ఇన్‌చార్జ్ వద్దిరాజు రవిచంద్ర అనుచరులు కొందరు.. సమావేశం నిర్వహిస్తున్న కౌన్సిలర్ల వద్దకు వచ్చి సముదాయించే ప్రయత్నం చేసినా శాంతించనట్లు సమాచారం.

సభా వేదికను పరిశీలించిన ఎస్పీ

ఇల్లెందు: ఇల్లెందులో నవంబర్ 1న సీఎం కేసీఆర్ హాజరయ్యే బహిరంగ సభా వేదికను ఎస్పీ డాక్టర్ జి. వినీత్, ఓఎస్‌డీ సాయి మనోహర్, ఇల్లెందు డీఎస్పీ ఎస్‌వీ రమణమూర్తి తదితరులు పరిశీలించారు. గ్రౌండ్, వేదిక, హెలీ ప్యాడ్, పార్కింగ్ ప్రదేశాన్ని సందర్శించారు. సెక్యూరిటీ విభాగంలో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.



మైదానాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ వినీత్

జంగ్ తెలంగాణ

‘పేట’ తీర్పు.. విలక్షణం

మూడుసార్లు ఎన్నికల్లో వేర్వేరు పార్టీల అభ్యర్థుల ఎన్నిక

- 2009లో ఏర్పడ్డ అశ్వారావుపేట నియోజకవర్గం
- కీలకంగా పారిశ్రామిక, వ్యవసాయ రంగాలు



వగ్గెల మిత్రసేన



తాటి వెంకటేశ్వర్లు



మెచ్చా నాగేశ్వరరావు



అశ్వారావుపేట: అసెంబ్లీ నియోజకవర్గాల డీలిమిటేషన్‌లో భాగంగా 2009లో ఏర్పడిన అశ్వారావుపేట నియోజకవర్గం రాజకీయ చైతన్యానికి పెట్టింది పేరు. మూడు నియోజకవర్గాలకు చెందిన 6 మండలాలతో ఎస్టీ రిజర్వ్‌డ్ సెగ్మెంట్‌గా ఆవిర్భవించింది. అశ్వారావుపేట నియోజకవర్గం రాష్ట్ర విభజన, జిల్లాల విభజన, మండలాల విభజనతో నిరంతరం రూపాంతరం చెందుతోంది. సత్తుపల్లి జనరల్ నియోజకవర్గంలోని అశ్వారావుపేట, దమ్మపేట మండలాలు, కొత్తగూడెం జనరల్ నియోజకవర్గంలోని చంద్రుగొండ మండలం, బూర్గంపాడు ఏజెన్సీ నియోజకవర్గంలోని వేలేరుపాడు, కుక్కునూరు, ములకలపల్లి 6 మండలాలతో ఈ నియోజకవర్గం ఏర్పడింది. 2014లో జరిగిన రాష్ట్ర విభజనలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు ఏపీకి బదలాయించటంతో కేవలం నాలుగు మండలాలకే నియోజకవర్గం పరిమితమైంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత జరిగిన జిల్లాల విభజనలో అశ్వారావుపేట భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోకి వచ్చింది. ఆ తర్వాత 2016లో జరిగిన మండలాల విభజనలో చంద్రుగొండ మండలం నుంచి అన్నపురెడ్డిపల్లి మండలం ఏర్పాటు కావడంతో ప్రస్తుతం 5 మండలాలతో అశ్వారావుపేట నియోజకవర్గం కొనసాగుతోంది. ఇక్కడ కోయ, నాయకపోడు, కొండరెడ్లు, బంజారా గిరిజనులు ఎక్కువగా నివసిస్తున్నారు.

నాలుగోసారి ఎన్నికలు

2009లో అసెంబ్లీ నియోజవర్గం ఏర్పాటు కాగా, ఈ సారి జరిగే ఎన్నికలు నాలుగోవి. తొలిసారి ఎమ్మెల్యేగా కాంగ్రెస్‌కు చెందిన వగ్గెల మిత్రసేన ఎన్నికయ్యారు. రెండోసారి 2014లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన తాటి వెంకటేశ్వర్లు గెలిచారు. మూడోసారి 2018లో మహాకూటమి బలపరిచిన టీడీపీ అభ్యర్థి మెచ్చా నాగేశ్వర రావు విజయం సాధించారు. ఇలా ఒక్కోసారి ఒక్కొక్కరు ఎమ్మెల్యేగా గెలుపొందారు. తొలి ఎమ్మెల్యే వగ్గెల మిత్రసేన రెండోసారి జరిగిన ఎన్నికల్లో ఓటమికి గురయ్యారు. రెండో ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మూడోసారి జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుపై పరాజయానికి గురయ్యారు. అశ్వారావుపేటకు ఎవరైనా ఒకసారే ఎమ్మెల్యే అనే నానుడి అప్పటినుంచి ఏర్పడింది. ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మూడోసారి బరిలో నిలుస్తున్నారు. కాంగ్రెస్ నుంచి తాటి వెంకటేశ్వర్లుతోపాటు జారే ఆదినారాయణ కూడా టికెట్ ఆశిస్తున్నారు. ఇంకా ఎవరికీ అభ్యర్థిత్వం ఖరారు కాలేదు. 2014లో టీడీపీ నుంచి, 2018లో మహాకూటమి(టీడీపీ) నుంచి బరిలో నిలిచిన మెచ్చా.. 2023 ఎన్నిల్లో బీఆర్‌ఎస్ నుంచి పోటీలో దిగారు. తాటి వెంకటేశ్వర్లు 2014లో వైఎస్‌ఆర్ సీపీ నుంచి, 2018లో టీఆర్‌ఎస్ నుంచి బరిలో ఉండగా, 2023లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు టికెట్ ఆశిస్తున్నారు. జారే ఆదినారాయణ 2014లో టీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి ఓటమికి గురయ్యారు. 2018లో టికెట్ దక్కక పోటీ చేయలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నారు.

వెంగళరావు హయాంలో ప్రాజెక్టులు

మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు హయాంలో అశ్వారావుపేట మండలంలోని గుమ్మడవల్లి ప్రాజెక్టు, ములకలపల్లి మండలంలోని మూకమామిడి ప్రాజెక్టు, చంద్రుగొండ మండలంలోని అన్నదైవం ప్రాజెక్టులు నిర్మించారు. అవి ఇప్పటికీ ఆయకట్టు భూములను సస్యశ్యామలం చేస్తున్నా పాలకుల నిర్లక్ష్యం కారణంగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. మాజీ మంత్రులు జలగం ప్రసాదరావు, తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావు సత్తుపల్లి నియోజకవర్గాల నుంచి రాజకీయం అరంగేట్రం చేయగా అప్పట్లో అశ్వారావుపేట సత్తుపల్లి నియోజకవర్గంలో అంతర్భాగంగా ఉండేది.

వైఎస్ హయాంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు..

2005లో దివంగత ముఖ్యమంత్రి ప్రారంభించిన అశ్వారావుపేట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ దేశంలోని పామాయిల్ క్రూడాయిల్ ధరను నిర్ణయించే ప్రతిష్టాత్మకమైనది. అప్పటి వరకు ఏపీలోని పెదవేగిలో ప్రభుత్వ పామాయిల్ ఫ్యాక్టరీ ఉండగా ఆధునిక ఫ్యాక్టరీని 2005లో అశ్వారావుపేటలో ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత దమ్మపేట మండలం అప్పారావుపేటలో మరో ఫ్యాక్టరీని ఏర్పాటు చేశారు. కెమిలాయిడ్స్, హెర్బెక్స్, పేపర్ మిల్లు, పవర్‌ప్లాంట్లతో అశ్వారావుపేట మినీ పారిశ్రామిక ప్రాంతంగా ఉంటుంది. ఇక్కడ వలస కార్మికులు కూడా ఎక్కువగానే ఉంటారు. అశ్వారావుపేటలో ప్రభుత్వ వ్యవసాయ కళాశాల ఉండగా, గతంలో బీఎస్సీ(ఏజీ)తోపాటు ఎమ్మెస్సీ కూడా ఉండేది. ప్రస్తుతం బీఎస్సీ(ఏజీ) మాత్రమే కొనసాగుతోంది. అవేర్ స్వచ్ఛంద సంస్థకు చెందిన ఐటీఐ, వ్యవసాయ ఇంటర్మీడియేట్ కాలేజీలు అశ్వారావుపేటలో ఉన్నాయి. ప్రభుత్వ రంగసంస్థలైన పట్టు పరిశోధనా సంస్థ, కొబ్బరి విత్తనోత్పత్తి క్షేత్రం, మామిడి వంగడాల తయారీ నర్సరీ, ఆయిల్‌పాం మొక్కల నర్సరీ ప్రత్యేకార్షణగా ఉన్నాయి.

అన్నింటా ప్రత్యేకమే..

అశ్వారావుపేట నియోజకవర్గం అన్నింటా ప్రత్యేకమే. మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావుకు అశ్వారావుపేట దివానం(గడీ)తో ప్రత్యేక అనుబంధం ఉందని ఇప్పటికీ చెప్పుకుంటారు. ఆయన సత్తుపల్లి ఎమ్మెల్యేగా గెలుపొందక ముందు అశ్వారావుపేట దివానానికి నిత్యప్రయాణం చేసేవారని, అశ్వారావుపేట జమీందారులే ఆయనకు రాజకీయ రంగప్రవేశం కల్పించారని చెబుతారు. పాల్వంచ సంస్థానంలో భాగంగా ఉన్న అశ్వారావుపేట జమీన్ ఏలూరు, నూజివీడు సంస్థానాల వరకు విస్తరించి ఉండేది. అప్పట్లో కోస్తా నుంచి నైజాంలోకి ప్రవేశించే వ్యాపారులు, వాహనదారులు అశ్వారావుపేట సరిహద్దులోని ఠాణా వద్ద సుంకం చెల్లించి వచ్చేవారట.

నగదు సీజ్..



పట్టుకున్న నగదును సీజ్ చేస్తున్న పోలీసులు

గుండాల: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీల్లో సోమవారం ఓ వ్యాపారి నుంచి రూ.9,60,000 నగదును పట్టుకుని సీజ్ చేశారు. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం ప్రకారం.. ఇల్లెందు – గుండాల మార్గంలో యాపలగడ్డ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నారు. అటుగా వెళ్తున్న మండల కేంద్రానికి చెందిన ఓ వ్యాపారి బైక్‌ను తనిఖీ చేయగా అతడి వద్ద రూ.9,60,000 నగదు లభించగా ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు. తనిఖీల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ వెంకటేశ్వర్లు, నరేశ్ పాల్గొన్నారు.

భద్రాచలంలో...

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని కూనవరం రోడ్డులో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న టౌన్ పోలీసులు భద్రాచలం నుంచి కూనవరం మీదుగా వెళ్తున్న వ్యాపారి వద్ద రూ.లక్ష నగదును సోమవారం పట్టుకున్నారు. ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు టౌన్ సీఐ నాగరాజురెడ్డి తెలిపారు.

దమ్మపేటలో..

దమ్మపేట: మండలంలోని మందలపల్లి చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ కారులో రూ.65,000 నగదును సోమవారం గుర్తించారు. వాహనదారుడు ఆధారాలు చూపకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు.

అంతా అరచేతిలోనే..

అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఈసీ తగిన ఏర్పాట్లు చేస్తోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి పకడ్బందీ చర్యలు చేపడుతోంది. క్షణాల్లో సమాచారం అందుబాటులో ఉంచేందుకు యాప్‌లు, వెబ్‌సైట్లు తీసుకొచ్చింది.


– భద్రాచలం అర్బన్

ఎన్నికల్లో తొలిసారిగా యాప్ సాంకేతికత

- ఇంటి నుంచే అనుమతులకు 'సువిధ'
- పోటీ చేసే అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు..
- పౌరుల చేతిలో బ్రహ్మాస్త్రంగా 'సీ–విజిల్'

నిఘా నేత్రంగా సీ–విజిల్..

ఎన్నికలు సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం సీ–విజిల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. నిఘా నేత్రంగా ఉపయోగపడే ఈ యాప్‌తో తమ ప్రాంతంలో నేతలు ప్రలోభాలకు గురిచేసి, తాయిలాలు ఇచ్చినా వెంటనే ఫొటో, వీడియో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది. ఫిర్యాదు అందిన ఐదు నిమిషాల్లోనే జిల్లా ఎన్నికల అధికారి నియంత్రణలోని మానిటరింగ్ సెల్‌కు వెళ్తుంది. ఐదు నిమిషాల్లోనే ఘటనా స్థలికి ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు చేరుతాయి. సదరు అధికారి క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేస్తారు. ఆ నివేదికను 30 నిమిషాల్లో రిటర్నింగ్ అధికారికి పంపితే 50 నిమిషాల్లో పరిశీలిస్తారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. కోడ్ ఉల్లంఘన జరగలేదని తేలితే ఆ ఫిర్యాదును యాప్ నుంచి తొలగిస్తారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను అధికారులు గోప్యంగా ఉంచుతారు.



డౌన్ లోడ్ ఇలా..

గత సాధారణ ఎన్నికల సమయంలోనే ఎన్నికల సంఘం సీ–విజిల్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం ఈ యాప్‌ను నవీకరించారు. ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతిఒక్కరూ ప్లేస్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవచ్చు.



సువిధ యాప్..

ఈ యాప్ పూర్తిగా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఉపయోగపడుతుంది. సింగిల్ విండో సిస్టం ద్వారా ఆన్‌లైన్‌లో ప్రచార వాహనాలు, మైకు, సభలు, సమావేశాలు.. తదితర అనుమతులు పొందేందుకు వీలుంటుంది. ఈ పోర్టల్ వినియోగించుకొని అభ్యర్థులు ఇంటి నుంచే అనుమతులు పొందవచ్చు. సంబంధిత నోడల్ అధికారి, సెక్షన్ అధికారులు, ఐటీ అధికారులు అందుబాటులో ఉంటారు. దరఖాస్తు ఆన్‌లైన్‌లో పొందుపర్చి పత్రాలను పరిశీలించి అన్ని సక్రమంగా ఉంటే అనుమతులిస్తారు.

సభలు, సమావేశాలు నమోదు..

గూగుల్‌ప్లే స్టోర్ ద్వారా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. తాము నిర్వహించే సమావేశం, తమకు ఏ విధమైన అనుమతులు అవసరమో వాటిని యాప్‌లో నమోదు చేయాలి. దరఖాస్తు ఎన్నికల అధికారులకు చేరిన 48 గంటల్లోనే అనుమతులు లభిస్తాయి. సాంకేతిక ఇబ్బందులు తలెత్తితే ప్రత్యామ్నాయంగా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. యాప్ ద్వారా సభా నిర్వహణ, సమావేశాల ఏర్పాటు, ర్యాలీలు, కార్లు, బైక్‌లు వినియోగించాల్సి ఉంటే ఆ వివరాలు, తాత్కాలిక ఎన్నికల కార్యాలయాల ఏర్పాట్లు, లౌడ్‌స్పీకర్లు, జెండాలు, పోస్టర్ల వినియోగం, ఇంటింటి ప్రచారం తదితరాలు పొందవచ్చు.

ముగ్గురు బీఎస్పీ అభ్యర్థుల ఎంపిక

భద్రాచలంలో రవి...



ఇర్పా రవి

భద్రాచలం: బీఎస్పీ భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా ఇర్పా రవిని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సోమవారం ప్రకటించారు. రవి 2021లో బహుజన సమాజ్ పార్టీ మణుగూరు మండల అధ్యక్షుడిగా, 2022లో మణుగూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆరు నెలల నుంచి జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఇతని తాతా ఇర్పా రాములు గతంలో భద్రాచలం సమితి అధ్యక్షుడుగా పని చేశారు. ఇంటర్మీడియట్ చదివిన రవి స్వగ్రామం మణుగూరు మండంలోని పగిడేరు.

పినపాకకు శ్యామ్...



వజ్జా శ్యామ్

బూర్గంపాడు: పినపాక నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థిగా వజ్జా శ్యామ్‌ను ప్రకటించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సోమవారం అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. మణుగూరు పట్టణానికి చెందిన శ్యామ్ ఎమ్మెస్సీ చదివాడు. ప్రస్తుతం వ్యవసాయంతో పాటుగా సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నాడు. శ్యామ్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించటంతో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

అశ్వారావుపేటలో ప్రసాద్...



మడకం ప్రసాద్

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థిగా మడకం ప్రసాద్‌ను ఆ పార్టీ ప్రకటించింది. బీఎస్పీ నుంచి రెండో జాబితాలో టికెట్ దక్కించుకున్న ఇతను గతంలో ఓ ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్‌గా పని చేయగా, గత కొంతకాలంగా పార్టీలో చేరి వివిధ స్థాయిలో పదవులు పొందారు. డిగ్రీ చదివిన ఈయన స్వగ్రామం మండలంలోని నందిపాడు. గతంలో వివిధ పార్టీల్లో పనిచేసిన ప్రసాద్ 2022లో బీఎస్పీలో చేరి, పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. కొద్ది నెలలుగా అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జిగా పని చేస్తూ, తాజాగా ఈ పార్టీ అశ్వారావుపేట నియోజకవర్గ అభ్యర్థిగా ఎంపికయ్యారు.

క్లుప్తంగా

గొత్తికోయ గ్రామంలో మలేరియా పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పాల్వంచ: మండలంలోని గొత్తికోయ గ్రామమైన మల్లారంలో సోమవారం ఢిల్లీ నుంచి వచ్చిన ఐసీఎంఆర్ బృందం మలేరియా పరీక్షలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఉల్వనూరు పీహెచ్‌సీ వైద్యులు తేజస్విని మాట్లాడుతూ.. మలేరియా నివారణకు కోసం పరీక్షలను నిర్వహించి, మందులు పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో చితురాం, సీహెచ్.సురేశ్, వి.రాంరెడ్డి, బి.శంకర్, పాండే, బట్టు, మనీశ్‌కుమార్, నరేందర్ చంద్ర, వర్షిప్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

ములకలపల్లి: అర్ధరాత్రి వేళ మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. ములకలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలోని ఓ మహిళ ఇంట్లోకి ఆదివారం అర్ధరాత్రి యువకుడు ఇంటి తలుపులు తట్టడంతో సదరు మహిళ గడియ తీసి ఎందుకు వచ్చావని ప్రశ్నించింది. ఈ క్రమంలో సదరు యువకుడు అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె కేకలు వేసింది. యువకుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తిరుమల్‌రావు తెలిపారు.

పాత పోలీస్‌స్టేషన్ గేట్‌కు బేడీలు




పాత పోలీస్‌స్టేషన్ గేట్‌కు వేసిన హ్యాండ్‌కప్స్

బూర్గంపాడు: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఇటీవల నూతన భవనంలోకి మార్చారు. దీంతో పాత పోలీస్‌స్టేషన్‌కు గేట్ వేసి తాళానికి బదులుగా బేడీలు వేశారు. ఈ ఫొటో సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొట్టింది. ఎస్‌ఐ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా పాత పోలీస్‌స్టేషన్‌కు గేట్ వేసి నిరుపయోగంగా ఉన్న హ్యాండ్ కప్స్ (బేడీలు) వేశామని, వాటిని తొలగించి తిరిగి తాళం వేశామని చెప్పారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

దమ్మపేట: వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం మండలంలోని సరోజనాపురంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రెడ్యాలపాడు గ్రామానికి చెందిన పాకలపాటి భాస్కర్‌రావు (60) తన ద్విచక్రవాహనంపై నాగుపల్లి గ్రామానికి వెళ్లి వస్తున్నాడు. సరోజనాపురం గ్రామానికి చేరుకోగానే నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా బైక్‌ను నడుపుతున్న మరోవ్యక్తి భాస్కర్‌రావును వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. స్థానికులు అతడిని ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి అల్లుడు మేడా సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రవి కుమార్ తెలిపారు.



పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,231

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా...

- ఇప్పటికే పోలీస్‌స్టేషన్ల వారీగా బైండోవర్లు
- అనుమతి లేకుండా ఇతర చోట్లకు వెళ్లొద్దని ఆదేశం

ఖమ్మంక్రైం: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా జిల్లావ్యాప్తంగా రౌడీషీటర్లపై పోలీస్‌శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. అందులో భాగంగా ఖమ్మం కమిషనరేట్ పరిధిలో అన్ని పో లీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీషీటర్లు, వివాదాస్పద వ్యక్తులపై దృష్టి సారించారు. రౌడీషీటర్లుగా నమోదైన వారితో పాటు సమస్యలకు కారణమవుతారనే సమాచారం ఉన్న వారిని తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేస్తున్నారు. సొంత పూచీకత్తుపై విడుదల చేస్తున్నా.. అనుమతి లేకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లొద్దని ఆదేశిస్తున్నారు.

జిల్లాలో 219 మంది రౌడీషీటర్లు

జిల్లావ్యాప్తంగా 219 మంది రౌడీషీటర్లు ఉన్నట్లు పోలీస్‌శాఖ రికార్డులు చెబుతున్నాయి. సబ్ డివిజన్ల ప్రకారం చూస్తే ఖమ్మంలో 61, ఖమ్మంరూరల్‌లో 57, వైరాలో 71, సత్తుపల్లిలో 30 మంది ఉ న్నారు. వారిలో కొంతమంది ఇతర ప్రాంతాలకు వెళ్లి జీవిస్తున్నారు. ఎన్నికలు రావడంతో పోలీస్ సిబ్బంది బయట ప్రాంతాల్లో ఎవరెవరు ఉంటున్నారో వారి గురించి ఆరా తీస్తున్నారు. కొంతమందిని పిలిపించి బైండోవర్ చేస్తుండగా రానివారికి సంబంధించి వారు ఎక్కడైతే నివసిస్తున్నారో అక్కడ ఉన్న పోలీస్ స్టేషన్‌లకు సమాచారం ఇచ్చి అప్రమత్తం చేస్తున్నారు. కమిషనరేట్ పరిధిలో సుమారు 500 మందికి పైగా ముఖ్యంగా ఎన్నికలు జరిగే సమయంలో సమస్యలు సృష్టించే వ్యక్తులను గుర్తిస్తున్నారు. దీనికితోడు పోలీస్ రికార్డుల్లో గతంలో నేరచరిత్ర కలిగిన వారితోపాటు ప్రస్తుతం నేరచరిత్ర ఉన్నవాళ్లను సైతం పోలీస్ అధికారులు గమనిస్తున్నారు. వారందరినీ బైండోవర్ చేయటం మొదలుపెట్టారు.

హత్య కేసులో 15 మంది రిమాండ్


బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఎల్)లో ఎర్రబోయిన నాగేశ్వరరావు హత్యకు గురైన విషయం విదితమే. కాగా, ఈ ఘటనలో 16 మందిపై హత్యాయత్నం కేసు నమోదైంది. వారిలో 15 మందిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా ఒకరు పరారీలో ఉన్నారు. రిమాండ్‌కు పంపిన వారిలో ఉమ్మినేని రమేశ్, ఉమ్మినేని బాబు, ఉమ్మినేని ప్రవీణ్, బండి సతీశ్, కల్యాణపు నాగేశ్వరరావు, కల్యాణపు వెంకటేశ్వరరావు, ఎనిగళ్ల మురళి, కాకనబోయిన సుబ్బారావు, మామిళ్ల నరసింహారావు, చింతలచెర్వు లక్ష్మీనారాయణ, మందా తిరుమలి, మందా వెంకటేశ్, సాధం కొండలు, ఆదూరి మనోజ్, బండి శ్రీను ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో కీచక టీచర్ !

- విద్యార్థుల పట్ల అసభ్య ప్రవర్తన
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

అశ్వారావుపేటరూరల్ : ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం ఊట్లపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బి.మోహన్‌రావు అనే ఉపాధ్యాయుడు.. రెండో తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థులు ఎక్కాలు సరిగా చెప్పలేదంటూ వారి దుస్తులు విప్పించాడు. అందులో ఇద్దరి దుస్తులను నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థినులతో విప్పించి అసభ్యంగా ప్రవర్తించాడని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అంతేకాక తమను దుస్తులు లేకుండా సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసి బెదిరించాడని విద్యార్థులు తల్లిదండ్రులకు చెప్పడంతో వారు సదరు టీచర్‌ను ప్రశ్నించేందుకు సోమవారం పాఠశాలకు రాగా, ఆ ఉపాధ్యాయుడు విధులకు గైర్హాజరయ్యాడు. దాంతో పాఠశాలలో తల్లిదండ్రులు ఆందోళన చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు మద్యం మత్తులో విధులకు హాజరవుతున్నాడని, ఇలాంటి టీచర్లతో విద్యార్థినులకు ఏం భద్రత ఉంటుందని ప్రశ్నించారు. అయితే శనివారం పాఠశాల హెచ్‌ఎం శిక్షణ కార్యక్రమానికి వెళ్లగా, ఓ టీచర్ సెలవు పెట్టారు. మరో ఉపాధ్యాయుడు మధ్యాహ్నమే వెళ్లిపోగా, మోహన్‌రావు ఒక్కడే స్కూళ్లో ఉన్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. తల్లిదండ్రుల ఆందోళన విషయం తెలుసుకున్న ఎస్సై పి.శ్రీకాంత్ అక్కడికి చేరుకుని వారిని శాంతింపజేశారు. అనంతరం తల్లిదండ్రులు ఉపాధ్యాయుడిపై పోలీసులకు, డీఈఓకు ఫిర్యాదు చేశారు. విద్యార్థులతో అనుచితంగా వ్యవహరించిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగరాజురెడ్డి

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని కూనవరం చెక్‌పోస్ట్ వద్ద టౌన్ ఎస్‌ఐ పీవీఎస్ రావు, సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా సోమవారం ఇద్దరు వ్యక్తులు గంజాయి తరలిస్తూ దొరికారు. కర్ణాటకకు చెందిన ప్రభు, మంజునాథ్ బైక్‌పై అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ఆపి తనిఖీ చేయగా వారి వద్ద 12 కిలోల గంజాయి (సుమారు రూ.3 లక్షల విలువైన) దొరికింది. ఆంధ్ర – ఒడిశా సరిహద్దు సీలేరు పరిసర ప్రాంతాల్లో ఆనంద్ అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్‌లో సాయికిరణ్ అనే వ్యక్తికి విక్రయించేందుకు తరలిస్తున్నట్లు విచారణలో తేలిందని పోలీసులు వెల్లడించారు. ఇద్దరు నిందితుల నుంచి మోటార్ సైకిల్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ సీఐ నాగరాజురెడ్డి వెల్లడించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన వివరించారు.

వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన ఇద్దరికి జైలు

అశ్వాపురం: వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ కొత్తగూడెం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి జి.భానుమతి సోమవారం తీర్పు వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి.. గొందిగూడెం గ్రామానికి చెందిన కాక నవీన్ (25) సీతారామ ప్రాజెక్ట్‌లో సెక్యూరిటీగా పనిచేస్తున్నాడు. జూలై 21 రాత్రి ఇద్దరు మిత్రులతో కలిసి బైక్‌పై డ్యూటీకి అశ్వాపురం వెళ్తున్నాడు. ఎలకలగూడెం గ్రామానికి చెందిన బుర్కా చంటి, జంపయ్య, మరో యువకుడు మరో బైక్‌పై అశ్వాపురం నుంచి గొందిగూడెం వస్తున్నారు. మార్గమధ్యలో మేలవాగు సమీపంలో నవీన్ బైక్.. ఆగి ఉన్న చంటి బైక్‌ను కొద్దిగా రాసుకుంది. దీంతో బైక్‌పై ఉన్నవారు కిందపడ్డారు. ఈ క్రమంలో చంటి, జంపయ్య.. నవీన్, వారి మిత్రులతో గొడవ పడ్డారు. బైక్ నడుపుతున్న నవీన్ వల్లే ప్రమాదం జరిగిందని అతడి బైక్‌ను చంటి, జంపయ్య లాక్కుపోయారు. నవీన్ ఇంట్లో చెప్పి బైక్ అడిగేందుకు రాత్రి వారి వద్దకు వెళ్లగా ఇవ్వకపోవడంతో మనస్తాపం చెంది తన చేను వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నవీన్ తండ్రి లక్ష్మణ్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్‌ఐ ఈ.రాజేశ్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. 14 మందిని సాక్షులను విచారించగా బుర్కా చంటి, బుర్కా జంపయ్యపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలుశిక్షతోపాటు రూ.3 వేలు జరిమానా, 384 ప్రకారం ఏడాది జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. రెండు శిక్షలు ఏకకాలంలో అనుభవించాలని తీర్పులో వెల్లడించారు. అదనపు పీపీ మీరజ్‌ఫిర్దౌసి, కోర్టు లైజన్ ఆఫీసర్ ఎం.హరగోపాల్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ ఎం.ఈశ్వర్‌రావు సహకరించారు.

హైఓల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం

సత్తుపల్లిటౌన్: విద్యుత్ హైఓల్టేజీతో గృహోపకరణాలు దగ్ధమైన ఘటన సత్తుపల్లిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణంలోని గుడిపాడురోడ్ శ్రీనగర్‌కాలనీలో నివాసం ఉంటున్న ఈప్రోలు లక్ష్మణ్‌రావు ఇంటిలో హైఓల్టేజీ రావటంతో రూ.70 వేల విలువైన టీవీ, గ్రీజర్, వాషింగ్ మిషన్, ఫ్యాన్లు, లైట్లు, ఇన్వర్టర్ కాలిపోయాయి. ఇలా రెండు సార్లు విద్యుత్ ప్రమాదం జరిగిందని బాధితుడు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు..

తిరుమలాయపాలెం: ఓ వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటనపై సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని చంద్రుతండాకు చెందిన ధరవత్ రవి ఈ నెల 28న ఇంటి నుంచి ఖమ్మంలో పనికివెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ కూడా పనిచేయకపోవడంతో భార్య ప్రమీల స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కుక్క దాడిలో బాలుడికి గాయాలు



గాయపడిన రోహిత్

మధిరరూరల్: మండలంలోని రొంపిమళ్లలో సోమవారం కుక్క దాడి చేసి ఓ బాలుడిని గాయపర్చింది. వివరాలిలా ఉన్నాయి.. పోతురాజు రోహిత్ గ్రామంలోనే ఉన్న అంగన్వాడీ కేంద్రానికి వెళ్తుండగా కుక్క అకస్మాత్తుగా వచ్చి బాలుడిపై దాడి చేసింది. తీవ్ర గాయాలు కాగా కుటుంబ సభ్యులు మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఖమ్మంకు రిఫర్ చేశారు.

స్కూటీ చోరీ

పాల్వంచ: ఇంటి ఎదుట నిలిపి ఉంచిన స్కూటీ చోరీకి గురైంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని టీచర్స్‌కాలనీలో వరిచెర్ల సతీశ్ ఈ నెల 28వ తేదీన రాత్రి 9.30 గంటల సమయంలో ఇంటి ఎదుట తన స్కూటీని పార్క్ చేశాడు. అనంతరం ఇంట్లోకి వెళ్లి అరగంట తర్వాత బయటకు వచ్చి చూడగా స్కూటీ కనిపించలేదు. సోమవారం బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాఘవయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో సోదరుడి హత్య

అన్నను చంపిన తమ్ముడు



రామారావు మృతదేహం

ములకలపల్లి : ఇంట్లో జరిగిన చిరు వివాదానికి తోడు మద్యం మత్తుతో సొంత అన్నను తమ్ముడు హతమార్చిన ఘటన ములకపల్లి మండలం మొగరాలగుప్పలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మొగరాలగుప్ప గ్రామ శివారులో డబుల్ బెడ్‌రూం ఇళ్లలో నివాసం ఉంటున్న కీసరి పొట్టి – బుల్లెమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు కీసరి రామారావు (23), వెంకటేశ్ ఉన్నారు. అందరూ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇద్దరు కొడుకులు నిత్యం మద్యం తాగి గొడవ పడుతుండేవారు. ఆదివారం సాయంత్రం వెంకటేశ్ చికెన్ తీసుకురాగా తల్లి కూర వండింది. పెద్ద కుమారుడు రామారావు తనకు కూర తక్కువ వేశావంటూ తల్లితో గొడవపడి చేయి చేసుకున్నాడు. పక్కనే ఉన్న వెంకటేశ్ కోపోద్రిక్తుడై పొయ్యిలో కట్టెతో రామారావు తలపై బలంగా కొట్టాడు. దీంతో రామారావు అక్కడే కుప్పకూలిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకునే లోపే రామారావు ప్రాణాలొదిలాడు. తల్లి బుల్లెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

గంజాయి రవాణా కేసులో ముగ్గురికి జైలు

కొత్తగూడెంటౌన్: గంజాయి అక్రమ రవాణా కేసులో ముగ్గురికి పదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ సోమవారం కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి (స్పెషల్ జడ్జి ఎన్‌డీపీఎస్ యాక్ట్) ఎం.శ్యాంశ్రీ తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి.. కొద్ది రోజుల కిందట భద్రాచలం పట్టణం కూనవరం రోడ్డులో అప్పటి ఎస్‌ఐ జి.రాంబాబు.. కుంట నుంచి విజయవాడకు వెళ్తున్న గన్నవరం డిపో బస్సులో తనిఖీ చేశారు. అందులో 63 కేజీల 400 గ్రాముల గంజాయి (రూ.7,60,800 విలువైన) ప్యాకెట్లను తీసుకెళ్తున్న ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరికి చెందిన మడకం దేవా, కొవాసీ సోనా, గణేశ్‌మండల్, తమిళనాడుకు చెందిన అలినగరం రంజిత్‌ను అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో ఉండగానే తమిళనాడుకు చెందిన రంజిత్ చనిపోయాడు. ఏడుగురు సాక్షులను విచారించగా దేవా, కొవాసీ సోనా, గణేశ్‌మండల్‌పై నేరం రుజువు కావడంతో ముగ్గురికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

వైరా ఇవ్వకపోతే ఒంటరిగానే పోటీ

సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

తిరుమలాయపాలెం: మిర్యాలగూడతో పాటు వైరా అసెంబ్లీ సీట్లను సీపీఎంకు కేటాయించకపోతే లౌకికశక్తులను కలుపుకొని తమకు బలమున్న అన్ని స్థానాల్లో ఒంటరిగా పోటీచేస్తామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. సోమవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని గజ్జల వెంకటయ్య భవనంలో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. లౌకికశక్తుల ఐక్యత కోరుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్‌రావుఠాక్రే ప్రతిపాదన పెట్టారని, ఆ ప్రకారం తాము ముందుకు వెళ్తుంటే కాంగ్రెస్ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికి పది సార్లు ఎన్నికలు జరిగితే దానిలో 8 సార్లు భద్రాచలం స్థానాన్ని సీపీఎం దక్కించుకుందని, అయినప్పటికీ తాము ఆ స్థానాన్ని త్యాగం చేస్తున్నామని తెలిపారు. తమకు బలం ఉన్న పాలేరుని వదులుకుని వైరా సీటును అంగీకరిద్దామనే నిర్ణయాన్ని కూడా కాంగ్రెస్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మిర్యాలగూడెం, వైరా ఇవ్వాలని లేకపోతే తమకు బలం ఉన్న చోట పోటిచేస్తామని నవంబర్ 2 నుంచి ఎన్నికల సభలకు సమాయత్తం అవుతామని తెలిపారు. కార్యక్రమంలో బుగ్గవీటి సరళ, షేక్ బషీరుద్దీన్, కొమ్ము శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సాయుధ బలగాల కవాతు



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

పెనుబల్లి: ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నామని కల్లూరు ఏసీపీ రామానుజం తెలిపారు. సోమవారం సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ ఆధ్వర్యంలో వీయం బంజర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెనుబల్లి బీసీకాలనీ, జంగాలకాలనీ, సోమ్లానాయక్ తండాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు సీపీ విష్ణు ఎస్ వారియర్ సూచనల మేరకు కవాతు నిర్వహించామని ఏసీపీ రామానుజం తెలిపారు.

రఘునాథపాలెం మండలంలో..

రఘునాథపాలెం: ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఖమ్మం నగర ఏసీపీ హరికృష్ణ తెలిపారు. సోమవారం రఘునాథపాలెం మండలంలోని కోయచలక, రేగులచలక గ్రామాల్లో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ (కవాతు) నిర్వహించాయి. కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ ఏసీపీ, రఘునాథపాలెం సీఐ కె.శ్రీధర్, టూటౌన్ సీఐ కుమారస్వామి, అర్బన్ సీఐ శ్రీహరి పాల్గొన్నారు.

కామేపల్లి మండలంలో..

కామేపల్లి: మండలంలోని పండితాపురం గ్రామంలో సోమవారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో రూరల్ ఏసీపీ బస్వారెడ్డి, సీఐ తిరుపతిరెడ్డి, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్



- బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్‌ను పర్యవేక్షించుటకు కన్‌స్ట్రక్షన్ సూపర్‌వైజర్ కావలెను. ఇంటర్వ్యూ : ఈ రోజు ఉదయం 10 గం॥లకు. శ్రీశ్రీశ్రీ హీరో, వైరా రోడ్ ఖమ్మం. సం॥ 96422 07955. [M-1221798]
- సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ సెక్యూరిటీ గార్డ్స్ కోదాడ దగ్గర మేళ్లచెరువులో కావలెను. 8గం॥ డ్యూటీ,మంచి జీతం తక్కువ రేటుకు భోజనం ✆ 86884 17132, 63008 79854 [B-425]
- త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం: 18K. Ph: 9848571888/ 9640400073 [H-189346]
- మా ఆఫీసు న్యూ బ్రాంచ్ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్‌టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [G-801029]
- ఒక ప్రముఖ సర్వే సంస్థలో తెలంగాణ ఎలక్షన్ క్యాంపెయిన్ & సర్వే చేయుటకు రాజకీయ అవగాహన కలిగిన వెండార్స్ (500+టీం మెంబర్స్) కావలెను. ఫోన్ : 7396856819, 7386886819 [HA-1343]
- Tanmayee ఓల్డేజ్ హోమ్, YSR సర్కిల్ వద్ద, పైపుల రోడ్డు, విజయవాడ. RMPలు, ఆడ, మగ వర్కర్లు, వంట మనిషి కావలెను. వయస్సు: 20 నుండి 50 సం॥ Ph: 9652423559/ 7093911010/ 9573000987 [HA-767]
- రామకృష్ణ గ్రూప్స్, (TS No.1) VJA, HYD శ్రీమంతులఇళ్ళలో వృద్ధుల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు వర్కర్స్ కావలెను / 24x7 పంపగలము. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 96038 92233, 62812 08600 [B-1206460]

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9010299957, 9705444182
కొత్తగూడెం : 9010223783
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914
మణుగూరు : 9705944416

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి
కేవలం రూ. 500/- మాత్రమే
(GST 5% అదనం)

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందం చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.




సబలెంకా శుభారంభం

మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో గత ఏడాది రన్నరప్, ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్) శుభారంభం చేసింది. మెక్సికోలో జరుగుతున్న ఈ టోర్నీలో తొలి లీగ్ మ్యాచ్‌లో సబలెంకా 6–0, 6–1తో మరియా సాకరి (గ్రీస్)పై గెలిచింది. 74 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకా ఆరు ఏస్‌లు సంధించి, తన ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. మరో లీగ్ మ్యాచ్‌లో జెస్సికా పెగూలా (అమెరికా) 7–5, 6–2తో రిబాకినా (కజకిస్తాన్)పై విజయం సాధించింది.

అర్జున్‌కు మూడో గెలుపు

గ్రాండ్ స్విస్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ మూడో విజయం నమోదు చేశాడు. యూకేలోని ఐల్ ఆఫ్ మ్యాన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో ఐదో రౌండ్ గేమ్‌లో తెల్లపావులతో ఆడిన అర్జున్ 68 ఎత్తుల్లో రినాత్ జుమాబయేవ్ (కజకిస్తాన్)పై గెలుపొందాడు. ఐదో రౌండ్ తర్వాత అర్జున్ నాలుగు పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి ఉమ్మడిగా టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు.




ఫారూఖీ

అఫ్గాన్ తీన్‌మార్...

- శ్రీలంకపై ఏడు వికెట్లతో సంచలన విజయం
- ఒకే టోర్నీలో మూడు ప్రపంచ చాంపియన్ జట్లను ఓడించిన హష్మతుల్లా బృందం
- బంతితో మెరిసిన ఫారూఖీ
- రహ్మత్ షా, హష్మతుల్లా, అజ్మతుల్లా అర్ధ సెంచరీలు

ఇకపై తమ జట్టును కూనగా పరిగణించాల్సిన అవసరం లేదని అఫ్గానిస్తాన్ చాటి చెప్పింది. మేటి జట్లపై తాము సాధిస్తున్న విజయాలు గాలివాటమేమీ కాదని తమ నిలకడైన ప్రదర్శనతో నిరూపించింది. మూడోసారి వన్డే ప్రపంచకప్‌లో ఆడుతున్న అఫ్గానిస్తాన్ ఈసారి తమకంటే అన్ని విభాగాల్లో ఎంతో మెరుగైన జట్లను బోల్తా కొట్టిస్తూ ఔరా అనిపించింది. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను కంగుతినిపించిన ఉత్సాహంతో 1992 విశ్వవిజేత పాకిస్తాన్ జట్టును కూడా మట్టికరిపించిన అఫ్గానిస్తాన్ జట్టు తాజాగా 1996 ప్రపంచ చాంపియన్ శ్రీలంకను ఓడించి అందర్నీ ఆశ్చర్యపరిచింది.

పుణే: ప్రత్యర్థి జట్టు గత రికార్డు ఎలా ఉంటేనేమి తమదైన రోజున సమష్టిగా గర్జిస్తే అద్భుత ఫలితం సాధించవచ్చని వన్డే ప్రపంచకప్ టోర్నీలో అఫ్గానిస్తాన్ జట్టు మూడోసారి నిరూపించింది. భారీ అంచనాలు పెట్టుకోకుండా ఈ మెగా ఈవెంట్‌లో బరిలోకి దిగిన అఫ్గానిస్తాన్ మూడో సంచలన విజయంతో అలరించింది. 1996 ప్రపంచ చాంపియన్ శ్రీలంక జట్టుతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో హష్మతుల్లా షాహిది నాయకత్వంలోని అఫ్గానిస్తాన్ జట్టు ఏడు వికెట్ల తేడాతో గెలిచి అబ్బురపరిచింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.3 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. నిసాంక (60 బంతుల్లో 49; 5 ఫోర్లు), కెప్టెన్ కుశాల్ మెండిస్ (50 బంతుల్లో 39; 3 ఫోర్లు), సమరవిక్రమ (40 బంతుల్లో 36; 3 ఫోర్లు), తీక్షణ (31 బంతుల్లో 29; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫజల్‌హక్ ఫారూఖీ (4/34) శ్రీలంక జట్టును దెబ్బ తీశాడు. ఒకదశలో 134/2తో పటిష్టస్థితిలో కనిపించిన శ్రీలంక నిసాంక అవుటయ్యాక తడబడింది. 107 పరుగుల తేడాలో ఏడు వికెట్లు కోల్పోయింది. కెరీర్‌లో 100వ వన్డే ఆడిన రషీద్ ఖాన్ ఒక వికెట్ తీయగా, మరో స్పిన్నర్ ముజీబ్‌కు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం 242 పరుగుల విజయ లక్ష్యాన్ని అఫ్గానిస్తాన్ 45.2 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ గుర్బాజ్ (0) డకౌట్‌కాగా... రహ్మత్ షా (74 బంతుల్లో 62; 7 ఫోర్లు), హష్మతుల్లా షాహిది (74 బంతుల్లో 58 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్), అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (63 బంతుల్లో 73 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో అఫ్గానిస్తాన్ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. హష్మతుల్లా, అజ్మతుల్లా నాలుగో వికెట్‌కు అజేయంగా 111 పరుగులు జోడించడం విశేషం.

ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో భారత్ చేతిలో ఓడిపోయిన అఫ్గానిస్తాన్... రెండో మ్యాచ్‌లో 69 పరుగుల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను ఓడించి బోణీ కొట్టింది. మూడో మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో 149 పరుగుల తేడాతో ఓడిపోయి... నాలుగో మ్యాచ్‌లో విజృంభించి 1992 విశ్వవిజేత పాకిస్తాన్‌పై ఏకంగా 8 వికెట్ల తేడాతో గెలిచింది. అనంతరం అదే ఉత్సాహంతో శ్రీలంకను కూడా మట్టికరిపించి అఫ్గానిస్తాన్ పాయింట్ల పట్టికలో ఐదో స్థానానికి ఎగబాకింది. మూడోసారి వన్డే వరల్డ్‌కప్‌లో ఆడుతున్న అఫ్గానిస్తాన్ ఒకే ప్రపంచకప్‌లో మూడు విజయాలు సాధించడం ఇదే ప్రథమం. 2015 ప్రపంచకప్‌లో ఒక మ్యాచ్‌లో నెగ్గిన అఫ్గానిస్తాన్... 2019 ప్రపంచకప్‌లో ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయింది. ఈ ప్రపంచకప్‌లో మాత్రం అఫ్గానిస్తాన్ తమ కంటే మెరుగైన జట్లకు చెమటలు పట్టిస్తోంది. ఈ టోర్నీలో అఫ్గానిస్తాన్ మిగిలిన మూడు మ్యాచ్‌లను నెదర్లాండ్స్ (నవంబర్ 3న), ఆస్ట్రేలియా (నవంబర్ 7న), దక్షిణాఫ్రికా (నవంబర్ 10న) జట్లతో ఆడుతుంది.


అజ్మతుల్లా


రహ్మత్ షా


హష్మతుల్లా

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) గుర్బాజ్ (బి) అజ్మతుల్లా 46; దిముత్ కరుణరత్నే (ఎల్బీడబ్ల్యూ) (బి) ఫారూఖీ 15; కుశాల్ మెండిస్ (సి) నజీబుల్లా (సబ్) (బి) ముజీబ్ 39; సమరవిక్రమ (ఎల్బీడబ్ల్యూ) (బి) ముజీబ్ 36; అసలంక (సి) రషీద్ ఖాన్ (బి) ఫారూఖీ 22; ధనంజయ డిసిల్వా (బి) రషీద్ ఖాన్ 14; ఏంజెలో మాథ్యూస్ (సి) నబీ (బి) ఫారూఖీ 23; చమీర (రనౌట్) 1; తీక్షణ (బి) ఫారూఖీ 29; కసున్ రజిత (రనౌట్) 5; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్)** 241. **వికెట్ల పతనం:** 1–22, 2–84, 3–134, 4–139, 5–167, 6–180, 7–185, 8–230, 9–239, 10–241. **బౌలింగ్:** ముజీబ్ ఉర్ రెహ్మాన్ 10–0–38–2, ఫజల్లహ్ ఫారూఖీ 10–1–34–4, నవీన్ ఉల్ హక్ 6.3–0–47–0, అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 7–0–37–1, రషీద్ ఖాన్ 10–0–50–1, నబీ 6–0–33–0.

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: రహ్మానుల్లా గుర్బాజ్ (బి) మదుషంక 0; ఇబ్రహీమ్ జద్రాన్ (సి) కరుణరత్నే (బి) మదుషంక 39; రహ్మత్ షా (సి) కరుణరత్నే (బి) రజిత 62; హష్మతుల్లా షాహిది (నాటౌట్) 58; అజ్మతుల్లా (నాటౌట్) 73; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (45.2 ఓవర్లలో మూడు వికెట్లకు)** 242. **వికెట్ల పతనం:** 1–0, 2–73, 3–131. **బౌలింగ్:** మదుషంక 9–0–48–2, రజిత 10–0–48–1, మాథ్యూస్ 3–0–18–0, చమీర 9.2–0–51–0, తీక్షణ 10–0–55–0, ధనంజయ డిసిల్వా 4–0–21–0.

ప్రపంచకప్‌లో నేడు

పాకిస్తాన్ X బంగ్లాదేశ్
వేదిక: కోల్‌కతా
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	6	6	0	12	1.405
దక్షిణాఫ్రికా	6	5	1	10	2.032
న్యూజిలాండ్	6	4	2	8	1.232
ఆస్ట్రేలియా	6	4	2	8	0.970
అఫ్గానిస్తాన్	6	3	3	6	-0.718
శ్రీలంక	6	2	4	4	-0.275
పాకిస్తాన్	6	2	4	4	-0.387
నెదర్లాండ్స్	6	2	4	4	-1.277
బంగ్లాదేశ్	6	1	5	2	-1.338
ఇంగ్లండ్	6	1	5	2	-1.652

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

అనీశ్ డబుల్ ధమాకా

కాంస్య పతకంతోపాటు పారిస్ ఒలింపిక్ బెర్త్ సొంతం



చాంగ్వాన్ (దక్షిణ కొరియా): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల పతకాల వేట కొనసాగుతోంది. సోమవారం జరిగిన పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత యువ షూటర్ అనీశ్ భన్వాలా కాంస్య పతకం సాధించాడు. ఆరుగురి మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో 21 ఏళ్ల అనీశ్ 28 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంతో ముగించాడు. ఈ ప్రదర్శనతో అనీశ్ వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను కూడా ఖరారు చేసుకున్నాడు. ఇప్పటి వరకు షూటింగ్‌లో భారత్‌కు 12 ఒలింపిక్ బెర్త్‌లు లభించాయి. మరోవైపు పురుషుల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో హైదరాబాద్ షూటర్ కైనన్ షెనాయ్, జొరావర్ సింగ్ సంధూ, పృథ్వీరాజ్ తొండైమన్‌లతో కూడిన భారత జట్టుకు రజత పతకం దక్కింది. కైనన్, జొరావర్, పృథ్వీరాజ్ బృందం 341 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచింది. ఇప్పటి వరకు ఈ టోర్నీలో భారత్ 30 పతకాలు సాధించింది.

వెర్‌స్టాపెన్ రికార్డు

ఈ సీజన్‌లో 16వ విజయం



మెక్సికో సిటీ: ఇప్పటికే ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సొంతం చేసుకున్నప్పటికీ... రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ మాత్రం ఫార్ములావన్–2023 సీజన్‌లో ఎదురులేకుండా దూసుకుపోతున్నాడు. మెక్సికో గ్రాండ్‌ప్రి రేసులో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. 71 ల్యాప్‌ల ప్రధాన రేసును మూడో స్థానం నుంచి ప్రారంభించిన వెర్‌స్టాపెన్ తొలి మలుపు వద్ద ప్రత్యర్థి డ్రైవర్లను ఓవర్‌టేక్ చేసి ఆధిక్యంలోకి వచ్చాడు. ఆ తర్వాత రేసు చివరిదాకా ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. వెర్‌స్టాపెన్ 71 ల్యాప్‌లను అందరికంటే వేగంగా 2 గంటల 2 నిమిషాల 30.814 సెకన్లలో పూర్తి చేసి విజేతగా నిలిచాడు. ఈ సీజన్‌లో వెర్‌స్టాపెన్‌కిది 16వ గెలుపు కావడం విశేషం. తద్వారా ఒకే ఏడాది అత్యధిక ఎఫ్1 రేసుల్లో గెలిచిన డ్రైవర్‌గా తన పేరిటే ఉన్న రికార్డును వెర్‌స్టాపెన్ బద్దలు కొట్టాడు. గత ఏడాది వెర్‌స్టాపెన్ 15 రేసుల్లో గెలుపొందాడు. ఓవరాల్‌గా వెర్‌స్టాపెన్ కెరీర్‌లో ఇది 51వ విజయం. ఈ క్రమంలో కెరీర్‌లో అత్యధిక ఎఫ్1 విజయాలు సాధించిన డ్రైవర్ల జాబితాలో నాలుగో స్థానంలో ఉన్న అలైన్ ప్రాస్ట్ (ఫ్రాన్స్) సరసన నిలిచాడు.

లెక్క సరిచేసిన భారత్



రాంచీ: ఆసియా మహిళల హాకీ చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు వరుసగా మూడో విజయంతో 'హ్యాట్రిక్' సాధించింది. చైనా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 2–1 గోల్స్ తేడాతో నెగ్గింది. భారత్ తరఫున దీపిక (15వ ని.లో), సలీమా టెటె (26వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. చైనా జట్టుకు జాంగ్ జియాకి (41వ ని.లో) ఒక గోల్ అందించింది. ఈ గెలుపుతో ఇటీవల హాంగ్జౌ ఆసియా క్రీడల్లో చైనా జట్టు చేతిలో సెమీఫైనల్లో ఎదురైన ఓటమికి భారత్ బదులు తీర్చుకుంది.

జ్యోతి యర్రాజీకి స్వర్ణం



పనాజీ: జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్‌కు మూడో స్వర్ణ పతకం లభించింది. సోమవారం జరిగిన అథ్లెటిక్స్ ఈవెంట్‌లో మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి యర్రాజీ చాంపియన్‌గా అవతరించింది. విశాఖపట్నం జిల్లాకు చెందిన జ్యోతి 13.22 సెకన్లలో అందరికంటే వేగంగా ఫైనల్ రేసును ముగించి అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు తెలంగాణ ఖాతాలో 11వ పతకం చేరింది. మహిళల స్విమ్మింగ్ 800 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో వ్రితి అగర్వాల్ రజత పతకం సాధించింది.

సినిమా

కౌంట్ డౌన్ స్టార్ట్


● వెంకటేశ్

వెంకటేశ్ హీరోగా శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'సైంధవ్'. నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా, బేబీ సారా, జయప్రకాశ్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న 'సైంధవ్' జనవరి 13న సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. కాగా ఇది వెంకటేశ్ కెరీర్‌లో 75వ చిత్రం కావడం విశేషం. తాజాగా 'సైంధవ్' విడుదలకు కౌంట్ డౌన్ స్టార్ట్ చేస్తూ మేకర్స్ ఓ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. ''పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోన్న చిత్రం 'సైంధవ్'. సినిమా విడుదలకు ఇంకా 75 రోజులు ఉంది. సంతోష్ నారాయణన్ ఈ చిత్రం కోసం అద్భుతమైన ఆల్బమ్ సిద్ధం చేశారు. త్వరలో మ్యూజికల్ ప్రమోషన్స్ స్టార్ట్ చేయబోతున్నాం'' అని మేకర్స్ అన్నారు. ఈ చిత్రానికి సహనిర్మాత: కిశోర్ తాళ్లూరు, కెమెరా: యస్. మణికందన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. వెంకటరత్నం (వెంకట్).

అమ్మాడీ...


● మృణాల్ ఠాకూర్, నాని

మాట రూపంలో కాకుండా ఇంకాస్త ఎక్కువగా ప్రేమను వ్యక్తపరచాలనుకున్నప్పుడు హీరో హీరోయిన్ పాట పాడుకోవడం చూస్తుంటాం. మృణాల్ ఠాకూర్‌పై నాని అలాంటి ప్రేమనే వ్యక్తపరిచారు. ప్రేమను వ్యక్తపరుస్తూ 'అమ్మాడీ...' అంటూ ఆమెను ఉద్దేశించి పాడారు నాని. 'హాయ్ నాన్న' చిత్రంలోని ఈ పాటను నవంబర్ 4న రిలీజ్ చేయనున్నారు. నాని, మృణాల్ ఠాకూర్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'హాయ్ నాన్న'. నాని కుమార్తెగా బేబీ కియారా ఖన్నా నటించింది. ఈ చిత్రం కోసం హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరచిన పాటల్లో తొలి పాట 'సమయమా..', రెండో పాట 'గాజు బొమ్మ..'ను ఇప్పటికే రిలీజ్ చేశారు. 'అమ్మాడీ...' మూడో పాట. నాని, మృణాల్ మధ్య సాగే రొమాంటిక్ సాంగ్ ఇది అని యూనిట్ పేర్కొంది. శౌర్యువ్ దర్శకత్వంలో మోహన్ చెరుకూరి (సీవీఎం), డా. విజయేందర్ రెడ్డి తీగల ఈ చిత్రాన్ని నిర్మించారు. డిసెంబర్ 7న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్ ఐఈఈ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సతీష్ ఈవీవీ.

మమ్మల్ని సినిమా కలిపింది - విజయ్ దేవరకొండ


● బ్రహ్మానందం, విజయ్ దేవరకొండ, తరుణ్ భాస్కర్, సాయికృష్ణ

''నేను, దర్శకులు నాగ్ అశ్విన్, తరుణ్ భాస్కర్, సందీప్ రెడ్డి వంగా వేర్వేరు చోట్ల పెరిగాం. మా నేపథ్యాలు వేరు.. మమ్మల్ని సినిమా కలిపింది. 'పెళ్ళి చూపులు'తో నన్ను హీరోగా పరిచయం చేశాడు తరుణ్ భాస్కర్. ఆ తర్వాత 'ఈ నగరానికి ఏమైంది'తో కొందరు కొత్తవాళ్లకు కెరీర్ ఇచ్చాడు. ఇప్పుడు 'కీడా కోలా'లోనూ ప్రతిభ ఉన్న కొత్తవాళ్ల కనిపిస్తున్నారు. తరుణ్‌కి తనపై, తన కథలపై చాలా నమ్మకం. ఈ విషయంలో అతన్ని గౌరవిస్తాను. ఇండస్ట్రీకి దొరికిన అదృష్టం తను'' అని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'కీడా కోలా'. రానా సమర్పణలో కె. వివేక్ సుధాంశు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్, శ్రీపాద్ నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 3న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన విజయ్ దేవరకొండ మాట్లాడుతూ–''తరుణ్ భాస్కర్‌పై ఉన్న నమ్మకంతో చెబుతున్నా.. 'కీడా కోలా' మజా ఇస్తుంది. త్వరలో మా ఇద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా వస్తుంది'' అన్నారు. సీనియర్ నటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ–''డైరెక్టర్ జంధ్యాలగారి సినిమాలు చేస్తున్నప్పుడు వినోదం ఎంత హాయిగా పండిందో మళ్లీ 'కీడా కోలా'కి అలాంటి అనుభూతి కలిగింది'' అన్నారు. ''నా 'పెళ్ళి చూపులు, ఈ నగరానికి ఏమైంది' చిత్రాల విడుదలప్పుడు చిన్న భయం ఉండేది. ప్రేక్షకుల స్పందన తెలుసుకునేందుకు థియేటర్ బయటే తిరిగేవాడిని. 'కీడా కోలా' విషయంలో ఆ భయం లేదు'' అన్నారు తరుణ్ భాస్కర్. ''రెండు గంటల పాటు ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు'' అన్నారు నిర్మాతలు సాయికృష్ణ గద్వాల్, శ్రీపాద్.

ప్రేక్షకులకు పది రెట్ల థ్రిల్ గ్యారంటీ - అనిల్ విశ్వనాథ్



''మా ఊరి పొలిమేర' తొలి భాగం ఓటీటీలో రిలీజ్ కావడంతో ప్రేక్షకుల స్పందన పెద్దగా తెలియలేదు. సినిమా చూసి, చాలామంది బాగుందని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. శుభలేఖ సుధాకర్‌గారు ఫోన్ చేసి, 'దర్శకుడిగా నీకు మంచి భవిష్యత్ ఉంటుంది' అని చెప్పడంతో నాపై నాకు మరింత నమ్మకం పెరిగింది'' అని డైరెక్టర్ డా. అనిల్ విశ్వనాథ్ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల, బాలాదిత్య, రాకేందు మౌళి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర–2'. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం నవంబరు 3న రిలీజవుతోంది. ఈ సందర్భంగా అనిల్ విశ్వనాథ్ మాట్లాడుతూ– ''మా ఊరి పొలిమేర' ఎక్కడ ముగిసిందో అక్కడి నుంచే రెండో భాగం మొదలవుతుంది. తొలి భాగం హిట్టవ్వడంతో సీక్వెల్‌పై అంచనాలు పెరిగాయి. అందుకే పార్ట్ 2 స్క్రీన్‌ప్లేను మరింత బలంగా తయారు చేశాను. తొలి భాగంతో పోల్చితే ప్రేక్షకులు దాదాపు పది రెట్ల థ్రిల్ ఫీలవుతారు. వంశీ నందిపాటిగారి సహకారంతో మా చిత్రాన్ని ఘనంగా రిలీజ్ చేస్తున్నాం. 'బన్నీ' వాసుగారికి నచ్చడంతో మా సినిమా పెద్ద రేంజ్‌కు వెళ్లింది. 'మా ఊరి పొలిమేర 3' కూడా ఉంటుంది. అంతకన్నా ముందు వేరే జానర్‌లో ఓ సినిమా చేస్తా'' అన్నారు.

ప్రేమకథ షురూ


● నాగచైతన్య, అలేఖ్య హారిక, సంతోష్ శోభన్

సంతోష్ శోభన్, అలేఖ్య హారిక జంటగా కొత్త సినిమా షురూ అయింది. సుమన్ పాతూరి దర్శకత్వంలో అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్‌పై ఎస్‌కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్న ఈ సినిమా సోమవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి డైరెక్టర్ చందూ మొండేటి కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో నాగచైతన్య క్లాప్ కొట్టగా, డైరెక్టర్ వశిష్ఠ మల్లిడి దర్శకత్వం వహించారు. డైరెక్టర్ హరీష్ శంకర్, నిర్మాత రవిశంకర్ యూనిట్‌కి స్క్రిప్ట్ అందించగా, హీరో సుశాంత్, దర్శకులు హను రాఘవపూడి, రాహుల్ సంకృత్యాన్ యూనిట్‌కి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంతోష్ శోభన్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో మంచి ప్రేమకథ ఉంటుంది'' అన్నారు. ''నా మనసుకు దగ్గరైన కథ ఇది. నేను, ఎస్‌కేఎన్, సందీప్ రాజ్, అలేఖ్య.. మేమంతా ఫ్రెండ్స్. ఈ సినిమా వారితో కలిసి చేస్తుండటంతో మరింత బాధ్యతగా భావిస్తున్నా'' అన్నారు సాయి రాజేశ్. ''ఈ సినిమాకు దర్శకత్వం వహించే చాన్స్ ఇచ్చిన నా ఫ్రెండ్ సాయి రాజేశ్‌కు థ్యాంక్స్'' అన్నారు సుమన్ పాతూరి. ''హీరోయిన్‌గా చేయాలనే నా కల ఈ చిత్రంతో నెరవేరుతోంది'' అన్నారు అలేఖ్య హారిక. ''తెలుగు అమ్మాయిలను ప్రోత్సహించాలనే నా సినిమాల్లో తెలుగు అమ్మాయిలనే హీరోయిన్‌గా తీసుకుంటున్నాను'' అన్నారు ఎస్‌కేఎన్. ఈ చిత్రానికి కెమెరా: అస్కర్, సంగీతం: విజయ్ బుల్గానిన్, సహనిర్మాతలు: ధీరజ్ మొగిలినేని, రమేశ్ పెద్దింటి.

ఒకేసారి ఐదు సినిమాలు ఒక సంచలనం - బ్రహ్మానందం


● అచ్యుతరావు, బ్రహ్మానందం, ఉపేంద్ర

''ఒక సినిమా తీయడానికే ఇబ్బంది పడుతున్న ఈ రోజుల్లో ఒకేసారి ఐదు సినిమాలు తీస్తుండటం ఓ సంచలనం. తన కుమారుడు ఉపేంద్రని హీరోగా పరిచయం చేయడంతో పాటు ఒకేసారి అతనితో ఐదు సినిమాలు తీస్తున్న అచ్యుతరావుకి అభినందనలు. దీనివల్ల పరిశ్రమను నమ్ముకున్నవారికి అవకాశాలు ఇచ్చి, భోజనం పెట్టినట్లవుతుంది. 'ఉపేంద్రగాడి అడ్డా' మంచి హిట్టవ్వాలి'' అని సీనియర్ నటుడు బ్రహ్మానందం అన్నారు. కంచర్ల ఉపేంద్ర, సావిత్రీ కృష్ణ జంటగా ఆర్యన్ సుభాన్ ఎస్‌కే దర్శకత్వం వహించిన చిత్రం 'ఉపేంద్రగాడి అడ్డా'. ఎస్ ఎస్‌ఎల్‌ఎస్ క్రియేషన్స్‌పై కంచర్ల అచ్యుతరావు నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరై, 'ఉపేంద్రగాడి అడ్డా' ట్రైలర్‌ను, '1920 భీమునిపట్నం' పోస్టర్‌ను విడుదల చేశారు. అలాగే ఉపేంద్ర హీరోగా ఇదే బ్యానర్‌లో తీస్తున్న ఐదు సినిమాల టీజర్లను విడుదల చేశారు. కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ– ''మా బ్యానర్‌లో నవంబర్ నుంచి ప్రతీ నెల ఒక సినిమాను విడుదల చేయబోతున్నాం'' అన్నారు. ''నా పుట్టిన రోజుకి ఇది వెలకట్టలేని పెద్ద బహుమతి'' అన్నారు కంచర్ల ఉపేంద్ర. ''సోషల్ మీడియా నేటి సమాజాన్ని ఎంతగా ప్రభావితం చేస్తోందో మా చిత్రం ద్వారా చూపిస్తున్నాం'' అన్నారు ఆర్యన్ సుభాన్ ఎస్‌కే. హీరోయిన్ సావిత్రీ కృష్ణ, సహనిర్మాతలు కంచర్ల సుబ్బలక్ష్మి, కంచర్ల సునీత పాల్గొన్నారు.

కథని నమ్మి చేశాం - శ్రీరామ్


● అవసరాల, ఖుషీ, శ్రీరామ్, సాయికిరణ్, కోన వెంకట్

''పిండం అనేది జననానికి, మరణానికి సంబంధించినది. ఈ 'పిండం' సాయి కిరణ్ లాంటి ప్రతిభగల దర్శకుడి పుట్టుకకు (ఇండస్ట్రీలో) కారణం కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు రచయిత, నిర్మాత కోన వెంకట్. సాయికిరణ్ దైదా దర్శకత్వంలో శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' ఉపశీర్షిక. కళాహి మీడియాపై యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్నారు కోన వెంకట్. మరో అతిథి బీవీఎస్ రవి (రచయిత, దర్శకుడు) మాట్లాడుతూ– ''ఈ సినిమా టీజర్, నిర్మాణ విలువలు బాగున్నాయి. తప్పకుండా విజయం సాధిస్తుంది'' అన్నారు. శ్రీరామ్ మాట్లాడుతూ– ''కథని నమ్ముకొని చేసిన చిత్రం 'పిండం'. ఈ సినిమాలో భాగం కావడం సంతోషంగా ఉంది. ఈ చిత్రంలో నటించిన ఇద్దరు పిల్లల నటన చూసి నేనే ఆశ్చర్యపోయాను. ఇలాంటి మంచి సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు. ''కళాహి మీడియా బ్యానర్‌పై 'పిండం'లాంటి మంచి సినిమాలు మరిన్ని చేస్తాం'' అన్నారు యశ్వంత్ దగ్గుమాటి. ''ఇదొక ఇంటెన్స్ హారర్ ఫిల్మ్'' అన్నారు సాయి కిరణ్ దైదా. సంగీత దర్శకుడు కృష్ణ సౌరభ్ సూరంపల్లి, కెమెరామేన్ సతీష్ మనోహర్ తదితరులు మాట్లాడారు.

అంబాజీపేట సంతృప్తి ఇచ్చింది - సుహాస్


● సుహాస్, శివానీ నాగరం

''అంబాజీపేట మ్యారేజి బ్యాండు' ఫ్రెష్ సబ్జెక్ట్. సినిమా కొత్తగా ఉంటుంది. నటుడిగా నాకు సంతృప్తినిచ్చింది. ఒక మంచి సినిమా చూశామనే అనుభూతితో ప్రేక్షకులు థియేటర్స్ నుంచి బయటకు వస్తారు'' అని సుహాస్ అన్నారు. దుశ్యంత్ కటికినేని దర్శకత్వంలో సుహాస్, శివానీ నాగరం జంటగా నటించిన చిత్రం 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. జీఏ2 పిక్చర్స్, మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ నిర్మించాయి. ఈ చిత్ర సంగీతదర్శకుడు శేఖర్ చంద్ర స్వరపరచిన 'గుమ్మా....' అంటూ సాగే తొలి పాటను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా దుశ్యంత్ కటికినేని మాట్లాడుతూ– ''ఈ పాటకి రెహ్మాన్ మంచి లిరిక్స్ ఇచ్చారు. ఈ సినిమాలోని పాటలన్నీ బాగుంటాయి'' అన్నారు. ''జనవరి నెలాఖరులో సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు ధీరజ్ మొగిలినేని. ''మంచి సినిమాలు ఎప్పుడొచ్చినా ప్రేక్షకులు ఆదరిస్తారు. 'అంబాజీపేట..' హిట్ కావాలి'' అన్నారు నిర్మాత ఎస్‌కేఎన్. నటులు జగదీశ్, నితిన్, డ్యాన్స్ మాస్టర్ మోయిన్ తదితరులు మాట్లాడారు.

బాధితులకు భరోసా

విజయనగరం జిల్లా రైలు ప్రమాద బాధితులకు సీఎం వైఎస్ జగన్ ఓదార్పు

- క్షతగాత్రుల్లో అవసరమైన ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం కల్పిస్తాం
- మృతుల కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ
- మృతుల కుటుంబీకుల కంటనీరు తుడిచిన ముఖ్యమంత్రి
- విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో 22 మంది క్షతగాత్రులు... ప్రతిఒక్కరికీ పరామర్శ
- వైకల్యం కారణంగా ఉపాధి పొందలేని వారికి రూ.5 లక్షలు..
- శాశ్వత వైకల్యం కలిగిన వారికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా
- పరిహారం విషయంలో సీఎం ఉదారత
- ప్రమాద స్థలంపై సీఎం ఏరియల్ సర్వే



బాధితురాలిని ఓదారుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, విజయనగరం/విజయనగరం ఫోర్ట్: విజయనగరం జిల్లాలో ఆదివారం రాత్రి సంభవించిన ఘోర రైలు ప్రమాదంలో బాధితులు, వారి కుటుంబ సభ్యులకు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పించారు. విధి వంచనతో పుట్టెడు దుఃఖంతో కుమిలిపోతున్న వారికి పెద్ద కొడుకులా అండగా నిలిచి వారి కన్నీరు తుడిచి ఓదార్చారు. తాను అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారు పూర్తిగా కోలుకునే వరకూ వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని ధైర్యం చెప్పారు. అలాగే, అనూహ్య దుర్ఘటనతో భయాందోళనలకు గురైన క్షతగాత్రులు తాము పూర్తిగా కోలుకున్నామన్న నమ్మకం వచ్చేంత వరకూ ఆస్పత్రిలో ఉంచాలని ఆయన సోమవారం బాధితులను పరామర్శిస్తూ అధికారులకు స్పష్టంగా చెప్పారు. వారికి ఎక్స్‌గ్రేషియా విషయంలో కూడా సీఎం ఎంతో ఉదారంగా వ్యవహరించారు.

విజయనగరం జిల్లా అలమండ రైల్వేస్టేషన్ సమీపంలో కంటకాపల్లి వద్ద ఆదివారం రాత్రి రెండు పాసింజర్ రైళ్లు ఢీకొన్న విషయం తెలిసిందే. విశాఖపట్నం నుంచి బయల్దేరిన విశాఖ–పలాస పాసింజర్ రైలును అదే మార్గంలో కొద్ది నిమిషాల వ్యవధిలో బయల్దేరిన విశాఖ–రాయగడ పాసింజర్ రైలు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు రైల్వే సిబ్బంది సహా 13 మంది దుర్మరణం పాలయ్యారు. 50 మంది క్షతగాత్రులయ్యారు. వారిలో 34 మందిని విజయనగరం సర్వజన ఆస్పత్రిలోను, మిగిలిన వారిని ప్రైవేట్ ఆస్పత్రుల్లో హుటాహుటిన చేర్చారు. ఆదివారం అర్ధరాత్రి విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చేరిన వారిలో స్వల్ప గాయాలైన వారు చికిత్స అనంతరం సోమవారం డిశ్చార్జి అయ్యారు. మిగిలిన 22 మంది బాధితులకు రెండు వార్డుల్లో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. వారిని స్వయంగా పరామర్శించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం విజయనగరం జిల్లాకు బయల్దేరి వెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 22 మంది క్షతగాత్రులను వారి వారి బెడ్ వద్దకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా వెళ్లి ప్రతీ ఒక్కరినీ పరామర్శించారు. వారికి వైద్యసేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఒకవేళ ఎవరికైనా అవసరమైతే ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించాలని చెప్పారు. ఒక్కపైసా కూడా వారిపై భారం పడకూడదని, పూర్తి ఉచితంగా వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులకు స్పష్టంగా చెప్పారు. మరోవైపు.. ఈ దుర్ఘటనతో భయాందోళనకు గురైన క్షతగాత్రుల్లో కొంతమంది ఇంకా షాక్‌లో ఉన్నట్లు గుర్తించిన ముఖ్యమంత్రి.. వారికీ ధైర్యం చెప్పారు.

ఉదారంగా ఎక్స్‌గ్రేషియా..

ఇక కంటకాపల్లి రైలు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారు. క్షతగాత్రుల విషయంలోనూ ఆయన ఎంతో ఉదారంగా వ్యవహరించారు. స్వల్ప గాయాలైన ప్రతి ఒక్కరికీ రూ.2 లక్షల చొప్పున సాయం ప్రకటించారు. నెలరోజుల కన్నా ఎక్కువ రోజులపాటు ఆస్పత్రిలో చికిత్స అవసరమైన వారికి.. వైకల్యం కారణంగా ఉపాధి పొందలేని వారికి రూ.5 లక్షల చొప్పున, శాశ్వత వైకల్యం కలిగిన వారికి రూ.10 లక్షల వరకూ ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కూడా సీఎం ఆదేశించారు. దీంతో.. క్షతగాత్రుల్లో ఎవరెవరికి ఎంత ఎక్స్‌గ్రేషియా చెల్లించాలో నిర్ణయించేందుకు డాక్టర్లతో కమిటీ వేసినట్లు విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి 'సాక్షి'కి తెలిపారు. ఈ మొత్తాన్ని మంగళవారం మంత్రి బొత్స సత్యనారాయణ, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల ద్వారా అందిస్తామని చెప్పారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం..

మృతుడి తండ్రి కన్నీళ్లు తుడిచిన సీఎం జగన్

ఈ ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కుశాలపురానికి చెందిన లోకో పైలట్ సువ్వారి చిరంజీవి మృతిచెందడంతో ఆయన తండ్రి సన్యాసిరావును ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఓదార్చారు. సీఎంను చూడగానే ఒక్కసారిగా సన్యాసిరావు బోరున విలపించారు. 'ఒక్కగానొక్క కొడుకు మృతిచెందాడు.. ఈ వయసులో మాకు ఎవరు దిక్కు'.. అంటూ కన్నీరుమున్నీరయ్యారు. సీఎం వెంటనే ఆయన కన్నీళ్లు తుడుస్తూ.. 'అధైర్య పడొద్దు.. కుటుంబానికి అండగా ఉంటా'మంటూ ఓదార్చారు.



లోకో పైలట్ సువ్వారి చిరంజీవి తండ్రి సన్యాసిరావును ఓదారుస్తున్న సీఎం జగన్

సీఎం ఏరియల్ సర్వే..



మరోవైపు.. రైళ్లు ఢీకొన్న ప్రమాద స్థలానికి వెళ్లి స్వయంగా పరిశీలించాలని సీఎం జగన్ తొలుత నిర్ణయించారు. అయితే, ట్రాక్ పునరుద్ధరణ పనులు, మరమ్మతులు శరవేగంగా జరుగుతున్నాయని, ఈ దృష్ట్యా సందర్శనను రద్దుచేసుకోవాలని రైల్వే అధికారులు సీఎంకు విజ్ఞప్తి చేశారు. దీంతో ఆయన హెలికాప్టర్‌లో నేరుగా విజయనగరంలోని పోలీసు శిక్షణ కళాశాల మైదానానికి చేరుకున్నారు. అక్కడ నుంచి ఆసుపత్రిలో క్షతగాత్రులు, మృతుల కుటుంబీకుల పరామర్శ అనంతరం విశాఖకు తిరిగివెళ్తూ ఏరియల్ సర్వే నిర్వహించారు.

రైలు ప్రమాదంపై ఉన్నతస్థాయి ఆడిట్ కమిటీ వేయాలి

ప్రధాని, రైల్వే మంత్రికి సీఎం జగన్ 'ఎక్స్'లో వినతి

సాక్షి, అమరావతి: విజయనగరంలో జిల్లాలో జరిగిన ఘోర రైలు ప్రమాదం తనను తీవ్రంగా కలిచివేసిందని, ఇటువంటి దుర్ఘటనలు ఎందుకు జరుగుతున్నాయన్న దానిపై ఉన్నతస్థాయి ఆడిట్ కమిటీ వేయాలంటూ ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ప్రధాని, రైల్వేమంత్రిని ట్యాగ్‌చేస్తూ ఆయన 'ఎక్స్'(ట్విట్టర్)లో పోస్ట్‌చేశారు. అందులో ముఖ్యమంత్రి ఏం పేర్కొన్నారంటే..

''ఆదివారం రాత్రి విజయనగరం జిల్లాలో జరిగిన ఘోర రైలు ప్రమాదం నన్ను చాలా బాధించింది. రన్నింగ్‌లో ఉన్న రైలు మరో రైలును ఢీకొట్టింది, ఈ రెండూ ఒకే దిశలో నడుస్తున్నాయి. ఈ భయంకరమైన ప్రమాదం కొన్ని స్పష్టమైన ప్రశ్నలకు దారితీస్తోంది..

- బ్రేకింగ్ సిస్టం, అలర్ట్ సిస్టం ఎందుకు పనిచేయలేదు?
- సిగ్నలింగ్ ఎందుకు విఫలమైంది?
- కమ్యూనికేషన్ వ్యవస్థ ఎలా విఫలమైంది?

ఇక భవిష్యత్తులో ఇలాంటి విధ్వంసకర ప్రమాదాలు పునరావృతం కాకుండా చూసేందుకు, ఈ లైన్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా అన్ని మార్గాల్లో ఈ అంశాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించేందుకు ఒక ఉన్నతస్థాయి ఆడిట్ కమిటీని ఏర్పాటు చేయాలని గౌరవనీయులైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, గౌరవనీయ రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌లను నేను హృదయపూర్వకంగా అభ్యర్థిస్తున్నాను. నా ఆలోచనలు, ప్రార్థనలు ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలతో కలిసి ఉన్నాయి. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి సాధ్యమైనంత ఉత్తమమైన సంరక్షణ చర్యలను మా ప్రభుత్వం అందిస్తోంది''.

బాధితులకు అండగా ప్రభుత్వం..

అంతకుముందు.. విజయనరం జిల్లా పర్యటన అనంతరం ముఖ్యమంత్రి 'ఎక్స్'లో మరో పోస్టు ద్వారా కూడా తన బాధను పంచుకున్నారు. ''విజయనగరం జిల్లా రైలు ప్రమాద ఘటనలో పలువురు మరణించడం బాధాకరం. వారి కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. ఈ ఘటనలో గాయపడి విజయనగరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించాను. వారు కోలుకునేంత వరకూ ప్రభుత్వం తోడుగా నిలుస్తుంది. వారికి మంచి వైద్యం అందించడంతో పాటు మరణించిన వారి కుటుంబాలకు, క్షతగాత్రులకు ఎక్స్‌గ్రేషియాను సత్వరమే అందించాలని అధికారులను ఆదేశించాను''.. అంటూ పేర్కొన్నారు.

13కు చేరిన మృతులు

- 50 మంది క్షతగాత్రులు
- విజయనగరం సర్వజనాస్పత్రి, విశాఖ కేజీహెచ్ తదితర ఆస్పత్రుల్లో కోలుకుంటున్న బాధితులు

ఆరిలోవ(విశాఖ తూర్పు)/మహారాణిపేట(విశాఖ దక్షిణ)/తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర) : విజయనగరం జిల్లా భీమాలి-ఆలమండ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతుల సంఖ్య 13కి చేరింది. మొత్తం 50 మంది గాయపడ్డారు. గాయపడ్డ వారిలో 34 మందిని విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించగా.. మిగిలిన వారిని విశాఖ కేజీహెచ్, రైల్వే, ఇతర ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. ఇదిలా ఉండగా, విశాఖ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరిన పలాస పాసింజర్‌లో స్పెషల్ గార్డుగా ఉన్న మరిపి శ్రీనివాసరావు(53) ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి.. విశాఖ ఆస్పత్రికి తరలించిన కొద్దిసేపటికే మృతిచెందాడు. రైల్వే అధికారులు కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని సోమవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. అలాగే, రాయగడ ప్యాసింజరుకు లోకో పైలట్‌గా ఉన్న విశాఖ జిల్లా తంగేడు గ్రామానికి చెందిన శింగంపల్లి మధుసూదనరావు(53) ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రత్యేక దర్యాప్తు బృందం రంగంలోకి..

సాక్షి, విశాఖపట్నం: వాల్తేరు డివిజన్ పరిధిలో రైలు ప్రమాదం జరగడం అత్యంత బాధాకరమని వాల్తేరు డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ అన్నారు. ప్రమాద స్థలికి ఆదివారం రాత్రి చేరుకున్న డీఆర్ఎం పునరుద్ధరణ పనుల్ని నిరంతరాయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో మాట్లాడారు. ప్రమాదానికి గల కారణాల్ని అన్వేషిస్తున్నట్టు తెలిపారు. సమగ్ర దర్యాప్తు చేసేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ ఆదేశించిందన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

సమగ్రంగా అధ్యయనం

జ్యుడిషియల్ పవర్స్ ఉన్న రైల్వే సేఫ్టీ కమిషనర్ నేతృత్వంలో ఉన్నతాధికారుల బృందం దర్యాప్తు ప్రారంభించింది. ప్రమాద సమయంలో రైలు ఎంత వేగంలో వెళ్తోందనేది నమోదైన స్పీడ్ రికార్డర్‌ను సీజ్ చేశాం. ప్రమాద సమయంలో సిగ్నల్ పొజిషన్ ఏ విధంగా ఉంది? మొదటి ఎక్స్‌ప్రెస్‌కు సంబంధించిన సిగ్నల్ ఎప్పుడు నమోదైంది.. రెండో రైలుకు సిగ్నల్ ఎప్పుడు ఇచ్చారు. ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తిందా మొదలైన అంశాలన్నీ డేటా లాగర్‌లో నిక్షిప్తమై ఉంటాయి. దీనికి సంబంధించిన డేటా లాగర్‌ని సీజ్ చేశాం. దీంతో పాటు రైల్లో ప్రయాణిస్తున్న వారి వద్ద నుంచి వివరాలు సేకరిస్తాం. మొత్తాన్ని సమగ్రంగా అధ్యయనం చేసి.. దర్యాప్తు బృందం తుది నివేదికను వెల్లడించాక తదుపరి చర్యలు తీసుకుంటాం. మొత్తం ఆరు కోచ్‌లు ప్రమాదానికి గురయ్యాయి. సోమవారం రాత్రి కల్లా మూడు లైన్లనూ అందుబాటులోకి తెస్తాం.

జిల్లా వార్తలు

కార్మికుల వీడీఏ లెక్కింపులో నిర్లక్ష్యం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం కార్మికులకు చెల్లించే వీడీఏ లెక్కింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించటం మూలంగా ప్రతీ కార్మికుడు ప్రతీనెల రూ.700 – 2000 వేల వరకు నష్టపోతున్నారని సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కార్మికులకు 1.8 శాతం పెరుగుదలతో వీడీఏను సెప్టెంబర్ నుంచి లెక్కించి అక్టోబర్ జీతంతో పెరిగిన వీడీఏ 13.6 శాతం నుంచి చెల్లించాల్సి ఉంది. కానీ పాత వీడీఏ 11.8 శాతంతో లెక్కించటం మూలంగా కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోలిండియా యాజమాన్యం సెప్టెంబర్15, 2023న సర్క్యులర్ జారీ చేసిందని, సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ జారీ చేయకుండా పెరిగిన డీఏకు సంబంధించిన సర్క్యులర్‌కు మాత్రమే విడుదల చేసి కార్మికులకు సంబంధించిన అంశంలో విడుదల చేయలేదని, ఫలితంగా అధికారులకు యథావిధిగా పెరిగిన వీడీఏ చెల్లించి కార్మికులను మాత్రం మరిచారన్నారు. వెంటనే పెరిగిన వీడీఏ ప్రకారం వారికి వేతనాలు సరిచేసి చెల్లించాలని యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు.

ప్రార్థనా మందిరాలు నిర్మించాలి



మాట్లాడుతున్న బిషప్ పద్మారావు

చర్ల: ప్రతి పల్లెలో ప్రార్థనా మందిరాలు నిర్మించాలని, తద్వారా ప్రత్యేక ప్రార్థనలు కొనసాగాలని దక్షిణ ఇండియా సంఘం డోర్నకల్ అధ్యక్ష మండల బిషప్ రెవరెంట్ డాక్టర్ కె.పద్మారావు పిలుపునిచ్చారు. మండలంలోని లింగాపురంలో నూతనంగా నిర్మించనున్న ప్రార్థనా మందిరానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం దుమ్ముగూడెం గ్రూప్ చైర్మన్ రెవ పి.రమేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధ్యక్ష మండల పరిధిలో ఉన్న ప్రతీ పల్లెలోనూ ప్రార్థనా మందిరాలు నిర్మించాలని, అందుకు అవసరమైన సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రూప్ సెక్రటరీ శాంతకుమార్, యూ నిట్ చైర్మన్ వెంకటరత్నంతోపాటు జర్మియా, దాసు, ప్రభుదాసు, కృపావరం, సంపత్, జేమ్స్‌స్టోన్, ఎస్. రాజు, ఆశీర్వాదం, డేవిడ్ వివేకానంద్, యోహాను, జోషిబాబు, జకర్యా, వినయ్, రాజు, జయపాల్, శ్రీను, పౌలు, యేసు రత్నం, పూర్ణచంద్, కర్రి ప్రమీల, కాకర్ల జయరాజు, శాంతయ్య పాల్గొన్నారు.

పత్తి ధరలో పురోగతి

- రూ. 7,100 పలికిన ధర
- కొనుగోళ్లకు సీసీఐ ముందుకు రావటంతో ధరలకు రెక్కలు

ఖమ్మంవ్యవసాయం: పత్తి ధర అడుగు ముందుకేసింది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం పత్తి గరిష్ట ధర రూ. 7,100 పలికింది. గత వారం గరిష్టంగా రూ.6,600 నుంచి రూ. 6,700 వరకు పలికిన ధర ఒక్కసారిగా పుంజుకుంది. నాణ్యత ఆధారంగా క్వింటాకు రూ. 400 నుంచి రూ. 500 వరకు వ్యాపారులు ధర పెంచారు. ప్రధానంగా తేమ, నాణ్యతను బట్టి వ్యాపారులు ధర నిర్ణయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది పత్తికి తేమశాతం ఆధారంగా గరిష్ట ధర రూ. 7,020గా నిర్ణయించింది. సీజన్ ఆరంభంలో పత్తికి కనీస మద్దతు ధర లేకపోవడంతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ద్వారా పత్తి కొనుగోళ్లు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ఆధారంగా పత్తి కొనుగోలు చేసేందుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర వ్యాప్తంగా పంట పండించే ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 10 వ్యవసాయ మార్కెట్ల పరిధిలో 14 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఉమ్మడి జిల్లాలోని జిన్నింగ్ మిల్లుల ద్వారా పత్తి కొనుగోళ్లకు సీసీఐ బయ్యర్లు అన్ని ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోని పలుచోట్ల సీసీఐ కేంద్రాలను ఏర్పాటు కూడా చేశారు.

సీసీఐ చర్యలతో రెక్కలు..

పత్తి కొనుగోళ్లకు సీసీఐ చర్యలు చేపట్టడంతో వ్యాపారులు పత్తి ధర పెంచారు. సీసీఐ అధికారులు కొనుగోళ్లు చేపడితే రైతులు అక్కడే విక్రయిస్తారని భావించిన వ్యాపారులు ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే కొంత అదనంగా చెల్లించి కొనుగోళ్లకు తెరలేపారు. పత్తి సీజన్ ప్రారంభమై 20 రోజులు కావస్తున్నా విక్రయాలు అరకొరగానే సాగుతున్నాయి. ఈ క్రమంలో వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టడంతో వ్యాపారులు ప్రభుత్వ మద్దతు ధరకు దాదాపు సమాంతరంగా గరిష్ట ధరలు పెడుతున్నారు. గరిష్ట ధర రూ. 7,100 పెట్టినా, నాణ్యతా ప్రమాణాల ఆధారంగా మోడల్ ధర రూ. 6,600 నుంచి రూ. 6,800 వరకు చెల్లిస్తున్నారు. సీసీఐని నిలువరించి రైతుల పంటను చేజిక్కించుకునేందుకు వ్యాపారులు ధర పెంచి కొనుగోళ్లు చేస్తున్నారు. ఇదిలా ఉండగా జాతీయంగా, అంతర్జాతీయంగా పత్తి సీడ్, భేల్ ధర పెరగటంతో పంటకు ధర వచ్చినట్లు వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. క్వింటాలు రూ. 2600 ఉన్న సీడ్ ధర రూ. 3,000కు చేరిందని, రూ. 56,500 ఉన్న భేల్ ధర రూ. 58 వేలకు చేరిందని, దీంతో పంట ధర పెరిగిందని ఖరీదుదారులు చెబుతున్నారు.

కొత్త, పాత పత్తి విక్రయాలు..

ప్రస్తుతం కొత్త పత్తి సీజన్ అయినప్పటికీ, గత ఏడాది పండించిన పత్తికి ధర లేకపోవటంతో రైతులు పంటను ఇళ్లలో నిల్వ పెట్టారు. గత ఏడాది పంట సీజన్‌లో రూ.10 వేల వరకు పలికిన పత్తి ధర క్రమంగా తగ్గుతూ వచ్చింది. రైతులు ధరపై ఆశతో పంటను ఇళ్లలోనే నిల్వ పెట్టారు. సీజన్ దాటినా ధర రాకపోవటంతో ప్రస్తుత సీజన్ పంట సాగు అవసరాల కోసం విక్రయాలు చేస్తున్నారు. దీంతో ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో నిల్వ పత్తితో పాటు ఈ ఏడాది సాగు చేసిన పత్తి కూడా విక్రయానికి వస్తోంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు నిత్యం 15 వేలకు పైగా బస్తాల పత్తి విక్రయానికి వస్తుండడం విశేషం.



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన పత్తి

మిర్చి ధర కూడా పైపైకి..

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధరలు కూడా పుంజుకుంటున్నాయి. సోమవారం గరిష్ట ధర రూ.25 వేలు పలికింది. పంట సీజన్ ఆరంభమైన జనవరిలో రూ. 21 వేలు ఉండగా విక్రయాలు పెరుగుతున్న క్రమంలో ధర మందగిస్తూ వచ్చింది. ఫిబ్రవరి ఆరంభం నాటికి రూ.18 వేలకు పడిపోయింది. అదే నెల చివరి నాటికి తిరిగి ధర పుంజుకుని 28వ తేదీ నాటికి రూ. 21,625గా పలికింది. మార్చిలో రూ. 22 వేల నుంచి రూ. 25 వేల మధ్య సాగింది. ఏప్రిల్, మే నెలల్లో తిరిగి తగ్గు ముఖం పట్టి రూ. 23 వేలు మాత్రమే నమోదైంది. జూన్ నెల నుంచి కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచిన మిర్చి విక్రయాలు ప్రారంభం కావడంతో ధర మరికొంత పుంజుకుని రూ. 24,700కు చేరింది. జూలై నుంచి అక్టోబర్ వరకు రూ. 23,600 నుంచి 24,500 మధ్య కొనసాగాయి. అక్టోబర్ చివరి వారంలో మాత్రం ధరలు పెరుగుతూ రూ. 25 వేల మార్కును తాకాయి. ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా వ్యాపారులు తేజా రకం మిర్చికి ధర పెడుతున్నారు.

ధర మరికొంత పెరిగే అవకాశం

తేజా రకం మిర్చి ధర మరికొంత పెరిగే అవకాశం కూడా ఉన్నట్లు అంచనాలు వేస్తున్నారు. ప్రస్తుతం దేశీయ విక్రయాలు కొనసాగుతుండగా, అరకొరగా విదేశీ విక్రయాలు కూడా సాగుతున్నాయి. అయితే విదేశీ ఎగుమతులు చేసే వ్యాపారులు దృష్టి సారిస్తే మార్కెట్ మరికొంత పుంజుకునే అవకాశం ఉండొచ్చని అంటున్నారు. విదేశీ ఆర్డర్లు లభిస్తే స్థానికంగా సరుకు లభిస్తుందా లేదా అనే చర్చ కూడా సాగుతోంది. మరో వారం రోజుల్లో మిర్చి ధర మరింతగా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

1,2 తేదీల్లో అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్/ కొత్తగూడెంటౌన్: నవంబర్ 1, 2వ తేదీల్లో ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో అథ్లెటిక్స్‌లో అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలబాలికలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు భద్రాద్రి జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అండర్–17 క్రీడాకారులు నవంబర్ 1న ఉదయం 9 గంటలకు, అండర్–14 క్రీడాకారులు నవంబర్ 2న హాజరుకావాలని కోరారు. 6వ తరగతి నుంచి ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థులు, 1.1.2007 తర్వాత జన్మించినవారు పోటీలకు అర్హులని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుల ధ్రువీకరణతో స్టడీ సర్టిఫికెట్లను, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు తీసుకురావాలని కోరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పాఠశాల క్రీడాకారుల కార్యదర్శులు కె.నర్సింహామూర్తి, స్టెల్లా ప్రేమ్‌కుమార్ ప్రకటన ఇచ్చిన వారిలో ఉన్నారు.

శ్రీ కోటమైసమ్మ తల్లి జాతర ఆదాయం రూ.26.16లక్షలు

గతేడాది కంటే రూ.24,452 తక్కువ

కారేపల్లి: కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో దసరా సందర్భంగా ప్రారంభమైన శ్రీ కోటమైసమ్మ తల్లి జాతర ఆదివారంతో ముగిసింది. సోమవారం ఆలయ ప్రాంగణంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ, పర్సా ట్రస్ట్ ఆధ్వర్యంలో హుండీ కానుకలను లెక్కించారు. ఈ ఏడాది హుండీల ద్వారా రూ.6,95,855, జాతరలో దుకాణాల ఏర్పాటు, జాయింట్ వీల్స్, కొబ్బరికాయలు, పూజాసామగ్రి, లడ్డూ ప్రసాదాల వంటి అమ్మకాలకు వేలం పాటల ద్వారా రూ.19,20,290.. మొత్తం రూ.26,16,145 ఆదాయం వచ్చిందని ఈఓ వేణుగోపాలాచార్యులు, పర్యవేక్షకురాలు ఆర్.సమత, పర్సా ట్రస్టు చైర్మన్ పర్సా పట్టాభిరామారావు తెలిపారు.

రూ.24,452 తగ్గిన ఆదాయం..

గతేడాదితో పోల్చితే.. ఈ ఏడాది జాతర ఆదాయం రూ.24,452 తగ్గింది. గత సంవత్సరం జాతర ఆదాయం రూ. 26,40,597 కాగా, ఇందులో హుండీల ద్వారా రూ. 7,06,077 వచ్చాయి. దీంతో పోల్చితే ఈ ఏడాది రూ.10 వేలు తగ్గినట్లయ్యింది. ఇక మిగిలిన వేలం పాటల ద్వారా రూ.14 వేలకు పైగా తగ్గింది. హుండీ లెక్కింపు కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాణోతు బన్సీలాల్, ఎంపీటీసీ మూడ్ జ్యోతిమోహన్, ఆలయ ప్రధాన అర్చకులు కొత్తలంక కైలాస శర్మ, సిబ్బంది మూడ్ మోహన్, తోటకూరి వెంకటేశ్వర్లు, గణితి నారాయణ, లలిత్ సాయి తదితరులు పాల్గొన్నారు. కారేపల్లి ఎస్ఐ పుష్పాల రామారావు బందోబస్తు నిర్వహిచారు.




హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ప్రజాప్రతినిధులు, ఆలయ సిబ్బంది

మరోమారు బీఆర్ఎస్ సత్తా చూపాలి

ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెంలో నవంబర్ 5న నిర్వహించే బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని, మరోమారు బీఆర్ఎస్ సత్తా చూపాలని రాజ్యసభ సభ్యుడు, కొత్తగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వదిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సీఎం సభను విజయవంతం చేయాలని, కొత్తగూడెం నుంచి వనమా వెంకటేశ్వరరావును భారీ మెజారిటీ గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, పినపాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోనేరు సత్యనారాయణ, మున్సిపల్ వైస్‌చైర్మన్ దామోదర్, బీఆర్ఎస్ నాయకులు కాసుల వెంకట్, మండే వీర హనుమంతరావు, జేవీఎస్ చౌదరి, భీమా శ్రీధర్, కొత్వాల శ్రీనివాసరావు, లక్కినేని సత్యనారాయణ, బత్తుల వీరయ్య, రాజుగౌడ్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న వనమా, పక్కన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

సీఎం సభా వేదిక పరిశీలన

ఇల్లెందు: మండలంలోని మొట్లగూడెంలో సీఎం సభా వేదిక, హెలీప్యాడ్ ఏర్పాట్లను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సోమవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వారం రోజులుగా సభావేదిక, హెలీప్యాడ్, పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు పనులు చేస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 1న నిర్వహించనున్న సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ప్రజలను భారీగా తరలించాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు హరిసింగ్ నాయక్, మెట్టెల కృష్ణ, సర్పంచ్ చీమల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఉదయ్‌కిరణ్‌కు జపాన్ నుంచి ఆహ్వానం

తల్లాడ: తల్లాడకు చెందిన తాళ్లూరి ఉదయ్‌కిరణ్‌ను జపాన్ దేశం ఆహ్వానించింది. ఉదయ్‌కిరణ్ చిల్లీ బ్యాగ్ ఫిల్లింగ్ ప్రాజెక్ట్ ద్వారా జాతీయ స్థాయిలో ఇన్‌స్పైర్ మనాక్ అవార్డు పొందాడు. ఈ క్రమంలో జపాన్ ప్రభుత్వం నుంచి సకూరా సైన్స్ హైస్కూల్ ప్రోగ్రామ్ ఆఫ్ జపాన్ ద్వారా వారి దేశాన్ని సందర్శించే అవకాశం కల్పించింది. నవంబర్ 5 నుంచి 11 వరకు వారం రోజుల పాటు జపాన్ దేశంలో నిర్వహించే సైన్స్ హైస్కూల్ ప్రోగ్రాంలో ఉదయ్‌కిరణ్ పాల్గొంటాడు. స్థానిక బాలభారతి విద్యాలయంలో పదో తరగతిలో 10/10 జీపీఏ సాధించాడు. చిన్నతనం నుంచే సైన్స్ అండ్ టెక్నాలజీ, చదువు పట్ల ఎక్కువగా శ్రద్ధ చూపించేవాడని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయ్‌కిరణ్‌ను సోమవారం కెఎస్ఎం విద్యాసంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, ప్రిన్సిపాల్ తాళ్లూరి రామారావు అభినందించారు.



ఉదయ్‌కిరణ్